అమలాపురం ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 37(ఆదివారం)
కనిష్ఠం : 29

పాపికొండలకు తరలివచ్చిన పర్యాటకులు 7

పెరుగుతున్న ఉష్ణోగ్రతలు
అల్లాడుతున్న ప్రజలు

- నిర్మానుష్యంగా మారిన రహదారులు
- మూతపడిన వ్యాపారాలు
- అప్రకటిత విద్యుత్ కోతలతో ప్రజలకు నరకప్రాయం


అమలాపురంలో జనసంచారం లేక నిర్మానుష్యంగా మారిన ప్రధాన రహదారి

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

వారంరోజులుగా రికార్డు స్థాయిలో పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో ప్రజలు అల్లాడి పోతున్నారు. నిత్యం 37 నుంచి 40 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. మరోవైపు విద్యుత్ మెయింటెనెన్స్ పేరిట గంటల తరబడి కోతలు విధిస్తుండడంతో ప్రజలు నరకయాతన పడుతున్నారు. వారంరోజులుగా జిల్లాలో ఉష్ణోగ్రతలు పెరిగాయి. దీంతో రాత్రి సమయాల్లో ఉక్కబోత ఎక్కువగా ఉంటోంది. ఎండ తీవ్రతను భరించలేక జిల్లా పరిధిలోని అమలాపురం పట్టణంతోపాటు రామచంద్రపురం, మండపేట మున్సిపాలిటీలతోపాటు వివిధ ముఖ్య ప్రాంతాల్లో వర్తక, వాణిజ్య, వ్యాపార సంస్థలు మూతబడ్డాయి. జాతీయ రహదారులపై కూడా వాహనాల రాకపోకలు నిలిచిపోవడంతో రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారాయి. జూన్ 1న కాల్వలకు నీటిని విడుదల చేసినప్పటికీ కోనసీమ జిల్లాలోని సెంట్రల్ డెల్టా, ఈస్టర్న్ డెల్టాలకు ఈనెల 12వరకూ విడుదలయ్యే అవకాశం లేదు. దీంతో తీర ప్రాంత గ్రామాలు, కాల్వ శివారు ప్రాంతాల్లో మంచి నీటి సమస్య ఉత్పన్నమై ప్రజలు అల్లాడిపోతున్నారు.

ఇష్టానుసారం విద్యుత్ కోతలు

మెయింటెనెన్స్ పేరిట విద్యుత్‌శాఖ అధికారులు తరచూ ఇష్టానుసారంగా విద్యుత్ కోతలు విధిస్తుండడంతో కోనసీమలోని వివిధ ప్రాంతాల ప్రజలు తీవ్రమైన ఇబ్బందులకు గురవుతున్నారు. విద్యుత్ కోతలు వారి పాలిట నరక కూపంగా మారాయి. శనివారం రాత్రి అమలాపురం పట్టణ పరిసర ప్రాంతాల్లో 9.45 గంటలకు విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. కొన్ని ప్రాంతాల్లో అర్ధరాత్రి 12.30 గంటలకు, మరికొన్నిచోట్ల 3 గంటలకు, కొన్ని ప్రాంతాల్లో ఉదయం 6.30 గంటలకు విద్యుత్‌ను పునరుద్ధరించారు. అమలాపురంలోని కలెక్టరేట్ ఎదుట ఉన్న మెట్ల కాలనీలో కొన్ని నివాసగృహాలకు రాత్రి 9.45 గంటల నుంచి 9గంటలపాటు నిరంతరాయంగా విద్యుత్‌ను నిలిపివేయడంతో తీవ్రమైన ఇబ్బందులకు గురయ్యారు. సబ్‌స్టేషన్‌కు ఫిర్యాదు చేసేందుకు ప్రయత్నించినా వారి ఫోన్లు పనిచేయలేదు.



సీనరేజీ.. మింగేశారు!

196.17 కోట్ల సీనరేజి నిధులకు వైసీపీ ఎగనామం

- ఉమ్మడి జిల్లాలో ఇదీ లెక్క
- గత ఐదేళ్లలో పూర్తిగా వసూళ్లు
- స్థానిక సంస్థలకు ఎగవేత
- ఆర్థిక సంస్థల నిధులూ ఇంతే
- పంచాయతీరాజ్‌కు తీవ్ర అవస్థ
- పవన్ ఆదేశాలతో గుట్టురట్టు
- లెక్క తేల్చిన అధికారులు
- మంత్రికి నివేదిక అందజేత

(కాకినాడ,ఆంధ్రజ్యోతి)

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఇసుక కుంభకోణం అంతా ఇంతా కాదు. అస్మదీయ కంపెనీలను అడ్డం పెట్టుకుని అప్పటి ప్రభుత్వ పెద్ద లు వేల కోట్లు దోచేశారు. ఐదేళ్ల పాటు ఇసుక దందాతో పెద్ద ఆర్థిక సామ్రాజ్యాన్నే నిర్మించుకున్నారు. ఇసుక తవ్వకాల ద్వారా సొంత ఆదాయం పెంచుకున్న నాటి ప్రభుత్వ పెద్దలు సీనరేజీ సొమ్మును సైతం దారి మళ్లించేశారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో రీచ్‌ల పరిధిలో పంచాయతీలు, మండల పరిషత్‌లు, జిల్లా పరిషత్‌కు ఈ డబ్బులను పంచాల్సి ఉంది. అదేదీ కాదని ఏకంగా దారి మళ్లించేశారు. ఐదేళ్ల పాటు రూ.196.17 కోట్లకు పంగనామాలు పెట్టారు. అధికారికంగా ఇసుక తవ్వకం కంపెనీల నుంచి డబ్బులు వసూలు చేసినా వాటిని పంచాయతీలు, మండల పరిషత్, జడ్పీ ఖాతాలకు జమ చేయలేదు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో వైసీపీ హయాంలో ఇసుక సీనరేజీ నిధులను ఎంత మేరకు ఎగ్గొట్టారనే దానిపై నివేదిక తయారు చేయాలని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఆదేశించిన నేపథ్యంలో అధికారులు ఇటీవల గత ప్రభుత్వ నిర్వాకాన్ని బట్టబయలు చేశారు.

అంతా అడ్డగోలే..

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో గోదావరి ఇసుకకు భారీ డిమాండ్ ఉంటుంది. పక్కనే ఉన్న విశాఖ నుంచి విజయవాడ వరకు అనేక నిర్మాణాలకు గోదావరి ఇసుకనే వాడతారు.గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో దాదాపు 23 వరకు రీచ్‌ల్లో ఇసుక తవ్వకాలు జరిగాయి. అత్యధికంగా కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాల పరిధి లోని రీచ్‌ల్లో తవ్వకాలు ఐదేళ్ల పాటు నిరాట ంకంగా నడిచాయి. లక్షలాది టన్నుల ఇసుకను తరలించేశారు. అధికారిక, అనధికారిక రీచ్‌ల నుంచి కోట్ల విలువైన ఇసుకను తవ్వి తర లించేశారు.అధికారికంగా అనుమతించిన రీచ్‌ల్లో దాదాపుగా ఇసుకను జేపీ గ్రూపు భారీ స్థాయిలో తవ్వింది.ఇలా తవ్వినందుకు ఇసుక సీనరేజీని సంబంధిత పంచాయతీలు, మండల పరిషత్‌లు, జిల్లా పరిషత్‌కు చెల్లించే నిమిత్తం ఈ కంపెనీ రాష్ట్ర ప్రభుత్వానికి చెల్లించాలి. ఆ సొమ్మును ప్రభుత్వం ఆయా పంచాయతీరాజ్ వ్యవస్థల ఖాతాలకు జమ చేయాలి. కానీ వైసీపీ తన ఐదేళ్ల పాలనలో ఇసుక ద్వారా ఖజానాకు వేల కోట్ల ఆదాయం సమకూరినా ఉమ్మడి జిల్లాలో స్థానిక సంస్థలకు నిధులు మాత్రం ఇవ్వలేదు. ఇసుక తవ్వే కంపెనీలు, సంస్థల నుంచి అధికారికంగా ఐదేళ్లు సీనరేజీ వసూలు చేసినా వాటిని దారి మళ్లించేసింది. స్థానిక సంస్థలకు పంగ నామాలు పెట్టింది. దీంతో ఏ అవసరానికీ పంచాయతీలకు డబ్బుల్లేక ఈసురోమనాల్సిన పరిస్థితి తలెత్తింది. ఇదే కాదు 14,15 ఆర్థిక సంఘం నిధులు సైతం పంచాయతీలకు ఇవ్వ కుండా మింగేసింది. చివరకు విద్యుత్ బకాయిల పేరుతో గుంజేసింది. పంచాయతీలను ఐదేళ్ల పాటు జగన్ సర్కారు నిర్వీర్యం చేసింది.

పవన్ ఆదేశాలతో గుట్టురట్టు..

గతేడాది డిప్యూటీ సీఎం పవన్ పం చాయతీరాజ్ శాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత కాకినాడలో అధికారులతో సమీక్షించారు. గడచిన ఐదేళ్లలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో వైసీపీ ప్రభుత్వం సాగించిన అరాచకాలపై అధికారులతో మాట్లాడారు.గత వైసీపీ ప్రభుత్వం పంచాయతీరాజ్‌శాఖ పరిధిలోకి వచ్చే సీనరేజీ ఎంత మేర దారిమళ్లించేసిందో లెక్కలు తీయాలని ఆదేశించారు.అమరావతిలో అధికారులు కొన్ని నెల ల పాటు ఫైళ్లు తిర గేసి లెక్కలు సిద్ధం చేశారు. దీని ప్రకారం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఐదేళ్లలో గత జగన్ సర్కారు రూ.196.17 కోట్లు స్థానిక సంస్థలకు ఇవ్వకుండా పంగనామాలు పెట్టినట్లు లెక్క తేల్చారు.ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 2019-2021లో రూ.15.37 కోట్లు, 2021-2022లో రూ.89.90 కోట్లు, 2022-2023లో రూ.41.50 కోట్లు,2023-2024లో రూ.36.90 కోట్లు, 2024-2025లో రూ.12.50 కోట్లు చొప్పున సీనరేజీని ప్రభుత్వం వసూలు చేసిందని నిగ్గు తేల్చారు. వీటిని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో పంచాయతీలు, మండల పరిషత్‌లు, జిల్లా పరిషత్‌కు ఇవ్వలేదని నివేదికలో విశ్లేషించారు.



ఏపీ ఈఏపీసెట్..
ఫలితాలు విడుదల

- జిల్లాలో ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీల్లో విద్యార్థులకు ఉత్తమ ర్యాంకులు
- ఫార్మసీ విభాగంలో ఆలమూరు విద్యార్థికి 3వ ర్యాంకు, ఇంజనీరింగ్ విభాగంలో పి.గన్నవరం విద్యార్థికి 26వ ర్యాంకు

అమలాపురం, జూన్ 8(ఆంధ్రజ్యోతి): ఏపీ ఈఏపీసెట్-2025 ప్రవేశ పరీక్ష ఫలితాలను ప్రభుత్వం ఆదివారం విడుదల చేసింది. జిల్లాలో ఇంజనీరింగ్, ఫార్మసీ, అగ్రికల్చర్ విభాగాల్లో పలువురు ఉత్తమ ర్యాంకులు సాధించారు. కోనసీమ జిల్లా పరిధిలో ఏపీ ఈఏపీసెట్-2025 మూడు విభాగాల్లో అర్హత సాధించిన వారి వివరాలు ఇలా ఉన్నాయి. జిల్లానుంచి ఇంజనీరింగ్ విభాగంలో మొత్తం 4036మంది విద్యార్థులు నమోదు చేసుకోగా వీరిలో 1916మంది విద్యార్థులు, 1775మంది విద్యార్థినులు వెరసి 3891 మంది పరీక్షలకు హాజరయ్యారు. వీరిలో 2866మంది అర్హత సాధించారు. విద్యార్థులు 1380 కాగా, విద్యార్థినులు 1486మంది ఉన్నారు. అగ్రికల్చర్, ఫార్మసీ విభాగంలో కోనసీమ జిల్లా నుంచి 1601 మంది విద్యార్థులు రిజిస్టర్ కాగా వారిలో 331మంది విద్యార్థులు, 1270మంది విద్యార్థినులు ఉన్నారు. వారిలో పరీక్షలకు 1510 మంది హాజరుకాగా 1205 మంది విద్యార్థినులు, 305మంది విద్యార్థులు హాజరయ్యారు. మొత్తం అగ్రికల్చర్, ఫార్మసీ విభాగంలో 1384మంది అర్హత సాధించగా విద్యార్థినులు 1121మంది, 263మంది విద్యార్థులు ఉన్నారు.

ర్యాంకులు సాధించిన వారు..

ఏపీ ఈఏపీసెట్-2025లో అగ్రికల్చర్, ఫార్మసీ విభాగంలో ప్రతిభా పాటవాలను ప్రదర్శించి ర్యాంకులు సాధించిన విద్యార్థుల వివరాలు ఇలా ఉన్నాయి. ఆలమూరు మండలం చొప్పెళ్లకు చెందిన డేగల అఖిలానందవినయ్‌మల్లేష్ అగ్రికల్చర్ విభాగంలో 3వర్యాంకు సాధించాడు.అమలాపురం పట్టణం యర్రమిల్లివారివీధికి చెందిన కొప్పినీటి వినాయక్‌అభిరామ్ 29వ ర్యాంకు సాధించాడు. ఉప్పలగుప్తానికి చెందిన లంకే అభిషేక్ 39వ ర్యాంకు, రావులపాలేనికి చెందిన తుమ్మూరి శివమణిదీప్ 44వ ర్యాంకు, రాయవరానికి చెందిన ద్వారంపూడి శ్యామ్‌కృష్ణారెడ్డి 57వ ర్యాంకు, పి.గన్నవరానికి చెందిన పేకేటి లక్ష్మీసాయిదినేష్ 73వర్యాంకు, మండపేటకు చెందిన పోలిశెట్టి తేజశ్రీభాస్కరమణిశంకర్ 143వ ర్యాంకు సాధించారు. రాయవరం మండలం వెంటూరుకు చెందిన నురుకుర్తి వైష్ణవి 150వ ర్యాంకు, ఊబలంకకు చెందిన జి.వేణుశ్రీలక్ష్మిప్రసన్న 157వ ర్యాంకు, మండపేటకు చెందిన రెడ్డి ప్రజ్ఞశ్రీ 226వ ర్యాంకు సాధించారు.

ఇంజనీరింగ్, ఫార్మసీలో..

పి.గన్నవరం మండలం మానేపల్లికి చెందిన కోడూరి యశ్వంత్‌రాజా 28వ ర్యాంకు, అమలాపురం రూరల్ మండలం ఇందుపల్లికి చెందిన వంక సాయిశ్రీరామ్‌సాత్విక్ 62వ ర్యాంకు, కొత్తపేట మండలం గొలకోటివారి పాలేనికి చెందిన టి.భరద్వాజ్ 114వ ర్యాంకు, ఆత్రేయపురానికి చెందిన ముదునూరి మణిదీప్‌వర్మ 118వ ర్యాంకు, మామిడికుదురు మండలం పాశర్లపూడికి చెందిన కొల్లా ప్రవీణ్‌కుమార్ 153వ ర్యాంకు, రాయవరం మండలం పసలపూడికి చెందిన బిక్కిని స్రుజన 194వ ర్యాంకు, అంబాజీపేట మండలం మాచవరానికి చెందిన గంధ్రోతు అఖిల్‌సాయి 207వ ర్యాంకు, రామచంద్రపురానికి చెందిన కేఎస్ హరిచైతన్యశివరామకృష్ణ 270వ ర్యాంకు, మండపేటకు చెందిన యరమాటి హంసినిశ్రీసాయిదేవి 282వ ర్యాంకు సాధించారు.


తల్లిదండ్రులతో అకీరానందవినయ్

డాక్టర్‌ను కావాలనుకుంటున్నా..

-డేగల అకీరానందవినయ్ మల్లేష్ కుమార్, ఫార్మసీ విభాగంలో రాష్ట్రస్థాయి 3వ ర్యాంకు, చొప్పెళ్ల, ఆలమూరు

ఏపీఈఏపీసెట్‌లో రాష్ట్రస్థాయిలో మూడో ర్యాంకు సాధించడం సంతోషంగా ఉంది. నీట్‌లో అత్యుత్తమ ర్యాంక్ సాధించి వైద్యుడి కావాలనుంది. కార్డియాలజిస్టుగా సేవలందించాలనుకుంటున్నా. ఆ మేరకు నా వంతు కృషి చేస్తున్నాను. నా విజయంలో తల్లిదండ్రులు, సోదరి,సోదరుడు ప్రోత్సాహం ఉంది.


తల్లిదండ్రులతో కోడూరి యశ్వంత్‌రాజా

సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌ను అవుతా

-కోడూరి యశ్వంత్‌రాజా (ఇంజనీరింగ్ విభాగంలో 26వ ర్యాంకు), మానేపల్లి గ్రామం, పి.గన్నవరం మండలం

పి.గన్నవరం, జూన్ 8(ఆంధ్రజ్యోతి): మాది పి.గన్నవరం మండలం మానేపల్లి గ్రామం. నాకు ఇంజనీరింగ్ విభాగంలో 26వ ర్యాంకు రావడం ఆనందంగాఉంది. ఇప్పటికే జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో ఆల్‌ఇండియా 480వ ర్యాంకు సాధించాను. ఖరగ్‌పూర్, ముంబాయి, హైదరాబాద్‌ల్లో మూడు కళాశాలల్లో ఏదో ఒకదానిలో ఐఐటీ చదువుకోవాలని అనుకుంటున్నా. భవిష్యత్తులో ఎంఎస్ చేసి సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ చేయాలన్నదే నా లక్ష్యం. ఈర్యాంకులు సాధించడానికి కారణం నా తల్లిదండ్రులు కోడూరి నాగవెంకటరత్నం, సత్యవేణి ఇచ్చిన ప్రోత్సాహమే.

దగ్ధమైన అంతర్వేది రథానికి **మెయిన్‌లో..**

రూ.96.39లక్షల ఇన్సూరెన్స్ విడుదల

గౌరవ వేతనాలు..
ఎప్పటికి అందేనో?

- 22 నెలలుగా ఎంపీటీసీలు, ఎంపీపీల ఎదురుచూపులు

అమలాపురం రూరల్, జూన్ 8(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల తరఫున ప్రాతినిధ్యం వహిస్తున్న ఎంపీటీసీలకు, మండల పరిషత్ అధ్యక్షులకు 22నెలలుగా గౌరవ వేతనాలు అందడంలేదు. కనీసం వారి ఎప్పుడు విడుదల అవుతాయో తెలియని పరిస్థితి నెలకొంది. గత వైసీపీ ప్రభుత్వంలో ఎంపీటీసీలకు సంబంధించి 10నెలలు గౌరవ వేతనాల బకాయిలను చెల్లించలేదు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం గత బకాయిలను విడుదల చేస్తుందని జిల్లాలోని ఎంపీపీలు, ఎంపీటీసీలు ఆశగా ఎదరు చూశారు. బకాయిలు పెరిగిపోవడం మినహా ఒక్క నెల వేతనం కూడా పొందలేకపోయారు. అమలాపురం రెవెన్యూ డివిజన్ పరిధిలో ఎంపీపీలు, ఎంపీటీసీలకు కోట్లరూపాయల మేర గౌరవ వేతనాలు బకాయిలున్నాయి. ఎంపీపీలకు గౌరవ వేతనం కింద రూ.6వేలు, ఎంపీటీసీలకు రూ.3వేలచొప్పున ప్రభుత్వం చెల్లిస్తుంది. గత వైసీపీ ప్రభుత్వం రెండుసార్లు గౌరవ వేతనాలను విడుదల చేసింది. అమలాపురం డివిజన్‌లో 320మంది ఎంపీటీసీలు, 16 మంది ఎంపీపీలు ఉన్నారు. ఎంపీటీసీలకు సంబంధించి 22 నెలల గౌరవ వేతనాల బకాయిలున్నాయి. 2023, ఆగస్టు నుంచి ఇప్పటివరకు 22నెలల గౌరవ వేతనాలను ఎంపీటీసీలకు చెల్లించాల్సి ఉంది. ఒక్క అమలాపురం రూరల్ మండలంలోనే ఎంపీపీకి రూ.90వేలు, 25మంది ఎంపీటీసీలకు రూ.15లక్షల మేర గౌరవ వేతనాల బకాయిలు చెల్లించాల్సి ఉంది.

జిల్లాలో ప్రశాంతంగా డీఎస్సీ పరీక్షలు

- రెండు షిఫ్ట్‌ల్లో పరీక్షల నిర్వహణ

అమలాపురం, జూన్ 8(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పరిధిలోని రెండు పరీక్షా కేంద్రాల్లో ఆదివారంతో డీఎస్సీ-2025 పరీక్షలు ప్రశాంత వాతావరణంలో ముగిశాయి. రెండు షిఫ్ట్‌ల్లో ఈ పరీక్షలను సమర్థవంతంగా నిర్వహించారు. ఇందుకు సంబంధించిన వివరాలను డీఈవో షేక్ సలీంబాషా ప్రకటించారు. మొదటి షిఫ్ట్‌లో అమలాపురం రూరల్ మండలం భట్లపాలెంలోని బీవీసీ ఇంజనీరింగ్ కళాశాలలో 160మంది అభ్యర్థులను కేటాయించగా వారిలో 159మంది హాజరు కాగా ఒకరు మాత్రమే గైర్హాజరయ్యారు. కాట్రేనికోన మండలం చెయ్యేరు శ్రీనివాస ఇంజనీరింగ్ కళాశాలలో 160మంది అభ్యర్థులకుగాను 156 మంది హాజరుకాగా నలుగురు గైర్హాజరయ్యారు. రెండో షిఫ్ట్‌లో భట్లపాలెం బీవీసీ ఇంజనీరింగ్ కళాశాలలో 160మంది అభ్యర్థులకు కేటాయించగా 130మంది హాజరయ్యారు. 22 మంది పరీక్షలకు గైర్హాజరయ్యారు. చెయ్యేరు ఇంజనీరింగ్ కళాశాలలో 160 మంది అభ్యర్థులను కేటాయించగా వారిలో 132మంది పరీక్షలకు హాజరు కాగా 28 మంది గైర్హాజరయ్యారు.

నేడు షైనింగ్ స్టార్ ప్రతిభా పురస్కారాల అందజేత

అమలాపురం, జూన్ 8(ఆంధ్రజ్యోతి): జిల్లాలో 2025 విద్యాసంవత్సరంలో పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో షైనింగ్ స్టార్ ప్రతిభా పురస్కారాలు అందజేయనున్నారు. అమలాపురం కలెక్టరేట్‌కు సమీపంలో ఉన్న శ్రీసత్యనారాయణ గార్డెన్స్‌లో సోమవారం ఉదయం 10 గంటలకు ప్రతిభావంతులైన విద్యార్థులకు పురస్కారాలు అందజేస్తారు. కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్‌తోపాటు విద్యాశాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొననున్నారు.

నేడు కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక

అమలాపురం టౌన్, జూన్ 8(ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లోని గోదావరి భవన్‌లో సోమవారం ఉదయం 10 గంటల నుంచి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు కలెక్టర్ మహేష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు ఎప్పటికప్పుడు 1100 కాల్‌సెంటర్ ద్వారా తమ ఫిర్యాదుల పరిష్కార పరిస్థితిని తెలుసుకోవచ్చునన్నారు. కొత్త ఫిర్యాదులు నమోదు చేసుకోవచ్చన్నారు. ప్రజల సౌకర్యార్థం ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని జిల్లాలోని మూడు రెవెన్యూ డివిజన్‌లు, 22మండల కేంద్రాలతోపాటు మున్సిపల్ కార్యాలయాల్లో నిర్వహిస్తారన్నారు. అర్జీదారులు ఆయా స్థాయిల్లో తమ సమస్యలు నమోదు చేసుకుని పరిష్కారం పొందాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

నేడు ద్రాక్షారామలో జిల్లాస్థాయి యోగా కార్యక్రమం

అమలాపురం, జూన్ 8(ఆంధ్రజ్యోతి): జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో సోమవారం ద్రాక్షారామలోని పురాతన శైవక్షేత్రమైన భీమేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో జిల్లాస్థాయి యోగా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ తెలిపారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రత్యేక ఈవెంట్లు నిర్వహిస్తున్నామన్నారు. ప్రజల్లో ఆరోగ్యపరంగా చైతన్యం తీసుకురావడంతోపాటు యోగా ప్రాముఖ్యతను వివరించేందుకు జిల్లాస్థాయి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. యోగా అనేది కేవలం వ్యాయామం మాత్రమే కాదని, శరీరం, మనస్సు, ఆత్మను సమన్వయపరిచే జీవనశైలి అని వివరించారు. ఆధునిక జీవన విధానంలో తీవ్రమైన ఒత్తిడితో పోరాడే వారికి యోగా ఒక సుస్థిర మార్గమన్నారు. ఆరోగ్యాంధ్రప్రదేశ్ సాధనలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం యోగాంధ్ర-2025 ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. ద్రాక్షారామ వంటి పవిత్ర పుణ్యక్షేత్రంలో యోగా నిర్వహించడంవల్ల ప్రజల్లో ఆరోగ్యంపట్ల ఆసక్తి మరింత పెరుగుతుందన్నారు. జిల్లాలోని ప్రభుత్వ ఉద్యోగులు, మహిళా సంఘాల సభ్యులు, యోగాసంస్థల ప్రతినిధులు, వలంటీర్లు ఈ కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. సోమవారం ఉదయం 7 గంటలకు జరిగే యోగా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.





దుమ్మెత్తిపోతోంది!

» దారుణంగా రాజమహేంద్రవరం - మల్లయ్యపేట పెట్రోల్ బంక్ రోడ్డు » ప్రజలకు అవస్థలు

- రాజమహేంద్రవరం సిటీ (ఆంధ్రజ్యోతి)

రాజమహేంద్రవరం- మల్లయ్యపేట పెట్రోల్ బంక్ రోడ్డు పరిస్థితి దుమ్ము, ధూళితో నానాటికి దారుణంగా మారుతోంది. కోటిలింగాల ఇసుక ర్యాంప్‌ల నుంచి వచ్చే భారీ లారీల దెబ్బకు తారు రోడ్డు కాస్తా మట్టి, ఇసుక పర్రలా మారిపోతోంది. ద్విచక్ర వాహనదారులు ఇసుక దారిలో జారి పడి గాయాలపాలవుతున్నారు. ఆర్టీసీ, ప్రవేట్ ట్రావెల్స్ బస్సులు ఈ రోడ్డుగుండానే ఎక్కువగా వెళ్తుంటాయి. ఇసుక లోడు లారీలు ఫుల్‌గా లోడ్ వేసుకుని వస్తూ దారిలో ఇసుకను వేస్తున్నాయి. అది రోడ్డుపై ఇతర వాహనాల కింద నలిగి మట్టిగా మారిపోయి రోడ్డంతా దుమ్ముతో నిండిపోతోంది. ఈ దుమ్ము వల్ల ఎదురుగా వచ్చే వాహనాలు కూడా కనిపించని పరిస్థితి ఉంది. రోజు రోడ్డు పక్కన ఉన్న వ్యాపారస్తులు, గృహాల్లో ఉండేవారు ఉదయం, సాయంత్రం బాకెట్లతో మట్టిని ఎత్తుకుని పారబోసే పరిస్థితి ఉంది. ద్విచక్రవాహనదారులు దుమ్ములో ఇబ్బందులు పడుతూ ప్రయాణం చేస్తున్నారు. రోడ్డులో దుమ్ము, ఇసుక కళ్లల్లో పడి అవస్థలు పడుతున్నామని, రెప్పపాటులో ప్రమాదాలు జరిగే అవకాశంఉందని భయాందోళన చెందుతున్నారు.

సీలేరు నదిలో గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం


అభిలాష్ మృతదేహం

మోతుగూడెం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా చింతూరు మండలం మోతుగూడెంలో పిక్నిక్ స్పాట్ వద్ద సీలేరు నదిలో కొట్టుకుపోయిన అభిలాష్ (18) మృతదేహం ధారాలమ్మ గుడి వెనక నదిలో ఆదివారం లభ్యమైంది. శనివారం మధ్యాహ్నం ఒంటిగంట నుంచి గజ ఈతగాళ్లతో మోతుగూడెం ఎస్ఐ సాధిక్, పోలీసు సిబ్బంది, పంచాయతీ కార్యదర్శి జి.మోహన్, ఆర్ఐ విగ్నేష్, వీఆర్వో రెవెన్యూ సిబ్బందితో గాలింపు చేపట్టగా ఆదివారం మధ్యాహ్నం నదిలోని రాళ్ల మధ్యలో ఇరుక్కుపోయిన యువకుడి మృతదేహాన్ని గుర్తించి ఒడ్డుకు తీసుకువచ్చారు. పోస్టుమార్టం నిమిత్తం చింతూరు ప్రభుత్వాసుపత్రికి తరలించినట్టు ఎస్ఐ సాధిక్ తెలిపారు. ప్రస్తుతం సీలేరు నది ప్రవాహం ఎక్కువ తక్కువ అవుతున్న కారణంగా సాధ్యమైనంత వరకు నదిలో దిగడం, ఈత కొట్టడం మానుకోవాలని పర్యాటకులకు ఆయన సూచించారు.

హెచ్చరిక బోర్డుల ఏర్పాటు

మోతుగూడెంలో పిక్నిక్ స్పాట్ వద్ద సీలేరు కాంప్లెక్స్ చీఫ్ ఇంజనీర్ డి.కామేశ్వరరావు ఆదేశాల ప్రకారం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వరప్రసాద్ ఆధ్వర్యంలో సివిల్ ఏడీఈ కొండబాబు పర్యవేక్షణలో పొల్లూరు సివిల్ అధికారులు ఆదివారం సాయంత్రం ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. ఈ నది తీరంలో ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో లోయర్ సీలేరు ఏపీ జెన్కో సివిల్ డివిజన్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ధారాలమ్మ గుడి వద్ద సిబ్బంది హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు.


హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేస్తున్న దృశ్యం

ఊపిరితిత్తుల సమస్యతో గిరిజన బాలిక మృతి


సంధ్య (ఫైల్)

ఎటపాక, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): ఊపిరితిత్తుల సమస్య (ఇన్‌పెక్షన్)తో గిరిజన బాలిక మృతిచెందిన ఘటన అల్లూరి జిల్లా ఎటపాక మండలం విస్సాపురం గ్రామంలో శనివారం రాత్రి జరిగింది. స్థానికుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన వాడే సంధ్య (13) గత నెల రోజులుగా ఊపిరితిత్తుల సమస్యతో బాధ పడుతుంది. బాలిక పట్ల తల్లిదండ్రులు నాటు మందు ఇచ్చేవాడిని ఆశ్రయించారు. బాలికకు అప్పుడప్పుడు జ్వరం రావడంతో ఆర్ఎంపీల వద్ద తరచూ చికిత్స చేయించడంతో కిడ్నీ సమస్య కూడా వచ్చినట్టు తెలిసింది. ఆరోగ్య పరిస్థితి విషమించడంతో భద్రాచలం, ఖమ్మం, హైదారాబాద్‌కు తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయింది. బాలిక చింతూరు ఆశ్రమ గర్ల్స్ హైస్కూల్‌లో ఏడో తరగతి పూర్తి చేసింది.

కరెంటుషాక్‌తో యువకుడి మృతి!

కొత్తపల్లి, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం తీరప్రాంతంలో ప్రముఖ కంపెనీలో యువకుడు కరెంటు షాక్‌తో మృతిచెందినట్టు తెలిసింది. కేఎస్ఈజెడ్‌లో రొయ్యల శుద్ధి చేసే కంపెనీలో కూలీపనులు చేస్తున్న ఒక యువకునికి కరెంటు షాక్ తగలడంతో అక్కడికక్కడే మృతిచెందాడనేది సమాచారం. కంపెనీ ప్రతినిధులు గుట్టు చప్పుడు కాకుండా మృతుడి బంధువులకు అప్పగించారని సమాచారం. దీనిపై కొత్తపల్లి పోలీసులను వివరణ కోరగా తమకు ఎటువంటి ఫిర్యాదురాలేదని ఎస్ఐ జివెంకటేష్ తెలిపారు.

హెల్మెట్ ఉన్నా..ఆగిన ఊపిరి!

ద్విచక్రవాహనం అదుపుతప్పి మహిళ మృతి

కుమారుడు, సోదరికి తీవ్ర గాయాలు


మరణించిన మమత (ఫైల్)

పిఠాపురం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురం బైపాస్‌రోడ్డులో ఆదివారం సాయంత్రం జరిగిన ప్రమాదంలో మహిళ మరణించగా కుమారుడు, సోదరికి తీవ్ర గాయాలయ్యాయి. ఆమె ద్విచక్రవాహనంపై ప్రయాణిస్తూ హెల్మెట్ పెట్టుకున్నప్పటికీ కింద బెల్ట్ పెట్టుకోకపోవడంతో తలకు గాయాలై చనిపోయింది. బెల్ట్ పెట్టుకోకపోవడంతో హెల్మెట్ ఊడిపోయి తలకు బలమైన గాయాలైనట్టు పోలీసులు గుర్తించారు. గొల్లప్రోలు మండలం దుర్గాడ గ్రామానికి చెందిన ఇంటి మమత(32) గొల్లప్రోలులోని మాధురి విద్యాలయంలో ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్నారు. తన కుమారుడు సుహాస్ (8), సోదరి జగ్గంపేటకు చెందిన పెనుమర్తి సోమలత(17)తో కలసి దుర్గాడ నుంచి ద్విచక్రవాహనంపై బయలుదేరారు. కాకినాడలో దంత పరీక్షల నిమిత్తం వైద్యుడి వద్ద అపాయింట్‌మెంట్ తీసుకుని వెళ్తుండగా రాపర్తి జంక్షన్ సమీపంలో గేదె అడ్డుగా రావడంతో అదుపు తప్పి పడిపోయారు. తీవ్రంగా గాయపడిన మమత అక్కడిక్కడే మరణించగా, సుహాస్, సోమలతకు తీవ్ర గాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం కాకినాడలోని ప్రవేటు ఆసుపత్రికి తరలించారు. మమత భర్త నాగేశ్వరరావు వ్యవసాయం చేస్తున్నారు. మమత సహచర ఉపాధ్యాయులు, బంధువులు, కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. పిఠాపురం ఎస్ఐ మణికుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చెరువు మట్టి తవ్వకాల్లో వివాదం
జనసేన నేతల మధ్య ఘర్షణ

పిఠాపురం రూరల్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురం మండలం ఎఫ్‌కే పాలెం, విరవాడ గ్రామాల పరిధిలో ఉన్న పాపిడిదొడ్డి చెరువులో జరుగుతున్న మట్టి తవ్వకాల్లో ఆదివారం వివాదం జరిగింది. జనసేన నాయకుల మధ్య ఘర్షణ చోటు చేసుకుని ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. చెరువులో మట్టి తవ్వకాలకు ఒక మహిళా రైతు పేరుపై అనుమతి తీసుకువచ్చి కొన్ని రోజులుగా తవ్వకాలు సాగిస్తూ మట్టిని విరవాడ, ఎల్ఎన్‌పురం, నరసింగపురం, కోలంక, విరవ తదితర గ్రామాల్లోని ఇటుక బట్టీలకు తరలిస్తున్నారు. ఇటుకబట్టీల తరలింపు విషయంలో జనసేన నాయకుల మధ్య వివాదం సాగుతోంది. ఈ నేపథ్యంలో ఆదివారం తవ్వకాలు జరుగుతున్న ప్రాంతానికి విరవ గ్రామానికి చెందిన పిఠాపురం మాజీ ఎంపీపీ కురుమళ్ల రాంబాబు చేరుకున్నారు. తవ్వకాలు సాగుతున్న తీరు సరిగా లేదని, గడువు ముగుస్తున్నా అన్ని ప్రాంతాలకు మట్టి సరఫరా చేయడం లేదని అభ్యంతరం తెలిపారు. అదే సమయంలో దీనికి విరవాడ గ్రామానికి చెందిన బొజ్జా రాంప్రసాద్ అభ్యంతరం చెబుతూ వాగ్వావాదానికి దిగారు. ఇది ఇరువర్గాల ఘర్షణకు దారి తీసి ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు.

పోలీసులకు పరస్పరం ఫిర్యాదులు

దీనిపై ఇరువురు తమపై దాడి జరిగిందని, బంగారు వస్తువులు పోయాయని పరస్పరం పిఠాపురం రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై ఫిర్యాదులు అందాయని, విచారణ జరుపుతున్నామని రూరల్ ఎస్ఐ జానీబాషా తెలిపారు. కాగా మట్టి తవ్వకాల వద్ద జనసేన నాయకులు బహిరంగంగా ఘర్షణకు దిగడం పిఠాపురం నియోజకవర్గంలో చర్చనీయాంశంగా మారింది.

రత్నగిరిపై అనంతలక్ష్మి సత్రం స్థల పరిశీలన


సత్రం స్థల పరిశీలన చేస్తున్న చీఫ్ ఇంజనీర్

అన్నవరం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధిలో రూ.11.40 కోట్లతో 105 గదులతో నిర్మించబోయే అనంత లక్ష్మి సత్రం స్థలాన్ని ఆదివారం దేవదాయశాఖ చీఫ్ ఇంజనీర్ శేఖర్ పరిశీలించారు. ఇప్పటికే టెండర్లు పిలవగా అనుమతి కోసం దేవదాయకమిషనర్‌కు లేఖ రాయడంతో కమిషనర్ ఆదేశాలతో పరిశీలించారు. దీనిపై నివేదికను కమిషనర్‌కు అందజేసి తదనంతర ఆదేశాలతో టెండర్‌ను ఖరారు చేయనున్నట్టు దేవస్థానం అధికారులు తెలిపారు. ప్రస్తుతం ఉన్న సీతారామ సత్రం పడగొట్టి ఆ ప్రాంతంలో కొత్త నిర్మాణం చేపట్టాలని టెండర్లు పిలిచారు. అయితే సీతారామ సత్రం పడగొట్టకుండా మరమ్మతులు చేపడితే సరిపోతుందని దేవదాయశాఖ ఇంజనీరింగ్ బృందం సూచించింది. దీంతో ఆ భవనం అలానే ఉంచి నూతనంగా వేరే ప్రదేశంలో నిర్మించాలని సూచించారు. దీంతో సత్యగిరి కొండపై నిర్మించాలని సూచించారు. ఈమేరకు విష్ణుసదన్ హాల్స్ ఎదురుగా నిర్మించాలని నిర్ణయించారు.

వివాదాస్పదమైన వివాహ డెకరేషన్ మండపం ఏర్పాటు

సత్యదేవుడి సన్నిధిలో ఆదివారం ఉదయం వివాహం చేసుకునేందుకు ఒక బృందం 2రోజుల క్రితం డెకరేషన్ మండపాల లీజుదారులను కలవగా వారు చెప్పిన ధరకు అంగీకరించపోవడంతో ఇతర ప్రాంతం నుంచి డెకరేషన్ మండపాన్ని తెప్పించుకోగా లీజుదారులు అడ్డుకున్నారు. తాము నిర్ణీత మొత్తం దేవస్థానానికి చెల్లిస్తున్నామని ఎందుకు అడ్డుకుంటున్నారని ప్రశ్నించారు. వివాదం ఈవో దృష్టికి చేరడంతో బయట నుంచి డెకరేషన్ మండపం ఏర్పాటు చేసుకుంటే నిర్ణీత రుసుం పెళ్లి బృందం వద్ద తీసుకుని అనుమతించాలని చెప్పడంతో వివాదం ఆగింది.

ఏపీఈఏపీసెట్ ఫలితాలు విడుదల

- ఉమ్మడి జిల్లాలో ఇంజనీరింగ్‌లో అర్హత సాధించిన 15,220మంది విద్యార్థులు
- అగ్రికల్చర్ ఫార్మసీలో అర్హులైన 6,710 మంది విద్యార్థులు
- ఫలితాలను విడుదల చేసిన సెట్ చైర్మన్, జేఎన్టీయూకే వీసీ సీఎస్ఆర్కే ప్రసాద్

జేఎన్టీయూకే, జూన్8 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జేఎన్టీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన ఏపీఈఏపీసెట్-2025 ఫలితాలను సెట్ చైర్మన్, ఉప కులపతి ప్రొఫెసర్ సీఎస్ఆర్కే ప్రసాద్ ఆదివారం సాయంత్రం విడుదల చేశారు. కాకినాడ, తూర్పుగోదావరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల్లో ఇంజనీరింగ్‌లో మొత్తం 15,220 మంది ఉత్తీర్ణత సాధించగా... అగ్రికల్చర్, ఫార్మసీ పరీక్షలో 6,710మంది ఉత్తీర్ణులైనట్టు తెలిపారు. కాకినాడ జిల్లాలో అగ్రికల్చర్ ఫార్మసీ పరీక్షకు 3,683మంది దరఖాస్తు చేసుకోగా 3,431 మంది హాజరుకాగా 3,077మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. అదేవిధంగా తూర్పుగోదావరి జిల్లాలో అగ్రికల్చర్ ఫార్మసీ పరీక్షకు 2585మంది దరఖాస్తుచేసుకోగా 2387 మంది హాజరుకాగా 2249 మంది ఉత్తీర్ణత సాధించినట్టు తెలిపారు. కోనసీమ జిల్లాలో అగ్రికల్చర్ ఫార్మసీ పరీక్షకు 1601 మంది దరఖాస్తు చేసుకోగా 1510 మంది హాజరుకాగా 1384 మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. కాకినాడ జిల్లాలో ఇంజనీరింగ్ పరీక్షకు 8986 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 8666 మంది హాజరుకాగా 6343 మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. తూర్పుగోదావరి జిల్లాలో ఇంజనీరింగ్ పరీక్షకు 7649 మంది దరఖాస్తు చేసుకోగా 7416 మంది హాజరుకాగా 6011మంది ఉత్తీర్ణత సాధించినట్టు తెలిపారు. కోనసీమ జిల్లాలో ఇంజనీరింగ్‌లో పరీక్షకు 4,036 మంది దరఖాస్తుచేసుకోగా 3,891 మంది హాజరుకాగా 2,866 మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. కార్యక్రమంలో కన్వీనర్ వీవీ సుబ్బారావు, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ రవీంద్రనాథ్, ఓఎస్డీ కోటేశ్వరరావు, కన్వీనర్లు రాము, సుమతి, సమన్వయకర్తలు చంద్రశేఖర్, జయప్రసాద్, ఉషాదేవి పాల్గొన్నారు.

కవలలకు ర్యాంకులు


వేజిత్, వేహితలకు మిఠాయిలు తినిపిస్తున్న తల్లిదండ్రులు

సామర్లకోట, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సామర్లకోట కొత్తూరు వీధికి చెందిన ఉపాధ్యాయులు యలమాటి శ్రీనివాసు-అరుణ దంపతుల కుమారుడు వేజిత్‌కు ఇంజనీరింగ్ విభాగంలో రాష్ట్రస్థాయిలో 96వ ర్యాంకు, కుమార్తె వేహితకు 172 ర్యాంకు లభించింది. వీరిద్దరూ కవలలు. జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో ర్యాంకులు రావడంతో ఐఐటీలో చేరేందుకు మక్కువ కనబరుస్తున్నారని తల్లిదండ్రులు చెప్పారు.

ఏపీఈఏపీసెట్‌లో 'తిరుమల' ప్రభంజనం

రాజమహేంద్రవరం రూరల్, జూన్ 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన ఏపీ ఈఏపీ సెట్ (ఇంజనీరింగ్, అగ్రికల్చరల్ అండ్ ఫార్మసీ) ఫలితాల్లో తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని తిరుమల ఐఐటీ అండ్ మెడికల్ అకాడమీ విద్యార్థులు రాష్ట్రస్థాయిలో 3వ ర్యాంకు, 8వ ర్యాంకు సాధించారని విద్యాసంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు తెలిపారు. ఇంజనీరింగ్ విభాగంలో కె.యశ్వంత్ సాత్విక్ స్టేట్ 3వ ర్యాంకు, ఎ.శ్రీహర్ష 20వ ర్యాంకు, కె.యశ్వంత్ రాజా 26వ ర్యాంకు, సీహెచ్ సాయి కేశవరామ్ 27వ ర్యాంకు, వి.తేజశ్రీ 31వ ర్యాంకు, కె.ప్రణీత్ 36వ ర్యాంకు, బి.సాయి శ్రీకర్ 66వ ర్యాంకు, కె.శంకర్ మానిక్ 77వ ర్యాకు, కె.వినీష్ 93 ర్యాంకు... 100లోపు 9, 1000లోపు 142, 2000లోపు 280, 5000లోపు 626, 10000లోపు 1012 మంది సాధించారని పేర్కొన్నారు. అగ్రికల్చరల్ విభాగంలో డి.కిరీటి స్టేట్ 8వ ర్యాంకు, ఎం.సంతోష్ రెడ్డి 12వ ర్యాంకు, ఎల్.అభిషేక్ 39వ ర్యాంకు, కె.నాగసాయిపవన్ 47వ ర్యాంకు, టి.సాహితి 55వ ర్యాంకు, కె.కశ్యప్ 58వ ర్యాంకు, పి.దినేష్ 73వ ర్యాంకు, టి.రామచంద్రన్ 77వ ర్యాంకు, ఎం.వైష్ణవి 81వ ర్యాంకు కైవసం చేసుకున్నారని.. 100లోపు 9 మంది, 1000 లోపు 85 మంది, 2000లోపు 140 మంది, 5000లోపు 272 మంది, 10000లోపు 415 మంది ర్యాంకులు సాధించారని తెలిపారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులను అకడమిక్ డైరెక్టర్లతో కలిసి తిరుమలరావు అభినందించారు.



ఉన్నత ర్యాంకులు సాధించిన కె.సాత్విక్, డి.కిరీటి

ఎలక్ట్రీషియన్ల రక్షణ, భద్రతకు ప్రాధాన్యం

డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్

పిఠాపురం నియోజకవర్గంలో 325మందికి సేఫ్టీకిట్ల అందజేత


మంగళగిరిలో ఎలక్ట్రీషియన్లకు సేఫ్టీ కిట్లు అందజేసిన డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్

పిఠాపురం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): ప్రాణాలపణంగా పెట్టి పనిచేసే ఎలక్ట్రీషియన్ల రక్షణ, భద్రతకు ప్రాధాన్యమివ్వాలని ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ సూచించారు. మంగళగిరిలోని క్యాంపు కార్యాలయంలో ఆదివారం పిఠాపురం నియోజకవర్గంలోని 325 మంది ప్రవేటు ఎలక్ట్రీషియన్లకు పని ప్రదేశాల్లో రక్షణ, భద్రత కోసం సేఫ్టీకిట్లను అందజేశారు. ఒక్కొక్కటి రూ.5వేలు విలువ చేసే ఈ సేఫ్టీకిట్‌లో ఎలక్ట్రికల్ పనులకు అవసరమైన టూల్‌కిట్, రబ్బర్ హ్యాండ్ గ్లోవ్స్, షూస్, జాకెట్లు ఉండగా వీటన్నింటిని పవన్ తన సొంత నిధులతో సమకూర్చారు. అనంతరం మాట్లాడుతూ ఏప్రిల్‌లో పిఠాపురం మండలం మల్లాం గ్రామంలో ఎలక్ట్రీషియన్‌గా పనిచేసే దళిత యువకుడు పల్లపు సురేష్ ఒకరి ఇంటిలో కరెంటు పనిచేస్తూ మరణించడం తనను తీవ్రంగా కలచివేసిందన్నారు. అతడి మరణంతో కుటుంబం పెద్ద దిక్కు కోల్పోయి నిరాధరమైందన్నారు. సురేష్ మరణం వెనుక ఉన్న కారణాలు పరిశీలిస్తే పేదరికం, విద్యుత్ పనులు చేసేటప్పుడు అతడి వద్ద రక్షణ పరికరాలు లేకపోవడంగా గుర్తించామని తెలిపారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకూడదనే లక్ష్యంతో తన సొంత నిధులతో ప్రవేటు ఎలక్ట్రీషియన్లందరికీ రక్షణ పరికరాల కిట్లు అందజేస్తున్నామని తెలిపారు. సురేష్ కుటుంబానికి ప్రధానమంత్రి సురక్షా బీమా యోజన పథకం ద్వారా రూ.2లక్షలు, చంద్రన్న బీమా ద్వారా రూ.2లక్షలు అందించే ఏర్పాటు చేశామని పవన్ చెప్పారు. నిరుద్యోగ యువత కోసం ప్రతి 3 నెలలకు ఒకసారి పిఠాపురం నియోజకవర్గంలో జాబ్ మేళా నిర్వహించేలా ఏర్పాటు చేస్తున్నామని ప్రకటించారు. కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్, పంచాయతీరాజ్ కమిషనరు కృష్ణతేజ, పిఠాపురం కమిషనరు కనకారావు పాల్గొన్నారు.

పాపికొండలకు తరలివచ్చిన పర్యాటకులు


పాపికొండలకు వెళ్తున్న పర్యాటక బోటు

దేవీపట్నం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాల నలుమూలల నుంచి పాపికొండల అందాలను తిలకించేందుకు ప్రకృతి ప్రేమికులు తరలివచ్చారు. దేవీపట్నం మండల పరిధిలో పోశమ్మగండి బోటు పాయింట్ నుంచి గోదావరి ముంపు పరీవాహక ప్రాంతాలైన పూడిపల్లి, తొయ్యేరు, దేవీపట్నం, అగ్రహారం, మూలపాడు, మడిపల్లి, మంటూరు, కచ్చులూరు, కె.గోందూరు, నడిపూడి తదితర గ్రామాల మీదుగా నాలుగు బోట్లలో 260మంది పాపికొండలకు వెళ్లారు. పేరంటాలపల్లిలో సందడి చేసి వెనుదిరిగారు. ముందుగా గండిపోశమ్మను దర్శించుకున్నారు. ఆలయం వద్ద భక్తులు పుణ్యస్నానాలు ఆచరించేందుకు గోదావరిలోకి వెళ్లకుండా రేవుల వద్ద పోలీసులు గస్తీ నిర్వహించారు. ప్రమాదాలు జరుగుతున్న దృష్ట్యా భక్తులు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.

లోవ దేవస్థానానికి రూ.6.60 లక్షల ఆదాయం

తుని రూరల్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లాలో ప్రసిద్ధి పుణ్యక్షేత్రం తలుపులమ్మ లోవ దేవస్థానానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. వివిధ విభాగాల ద్వారా ఆలయానికి రూ.6.60 లక్షల ఆదాయం సమకూరినట్టు ఈవో వి.విశ్వనాధ్‌రాజు తెలిపారు.


ప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు

హైకోర్టు జడ్జి ప్రత్యేక పూజలు

సామర్లకోట, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): పంచారామ పుణ్యక్షేత్రమైన సామర్లకోట భీమేశ్వరాలయానికి చెన్నై హైకోర్టు జడ్జి ఎన్.మాల, కమిషనరు ఆఫ్ యూత్ సర్వీసెస్ (విజయవాడ) కె.శారద ఆదివారం విచ్చేశారు. వారికి ఈవో నీలకంఠం ఆధ్వర్యంలో వేదపండితులు సాదర స్వాగతం పలికారు. భీమేశ్వరస్వామికి అభిషేకాలు, బాలాత్రిపురసుందరి అమ్మవారికి విశేష కుంకుమార్చన జరిపారు. నంది మండపం వద్ద పండితులు వేదాశీర్వచనం ఇచ్చి ప్రసాదాలు, స్వామి, అమ్మవార్ల చిత్రపటాలు అందజేశారు.


వేదాశీర్వచనంతో ప్రసాదాలు అందజేస్తున్న దృశ్యం

ప్రశాంతంగా జేఈ రాత పరీక్ష

యానాం, జూన్ 8(ఆంధ్రజ్యోతి): పుదుచ్చేరి విద్యుత్ శాఖలో 73జూనియర్ ఇంజనీర్ పోస్టులకు ఆదివారం రాత పరీక్ష ప్రశాంతంగా జరిగింది. పుదుచ్చేరిలో ఆరు కేంద్రాల్లో జరిగిన పరీక్షకు పుదుచ్చేరి, కారైకాల్, మాహే, యానానికి చెందిన 1,904మందికి 1415మంది హాజరయ్యారు. రెండు రోజుల్లో ఫలితాలు ప్రకటిస్తారు.

వేంకటేశ్వరస్వామి కల్యాణం

మలికిపురం, జూన్ 8(ఆంధ్రజ్యోతి): చింతలమోరిలో వేంచేసి ఉన్న పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామివారి కల్యాణ మహోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. దొడ్డా బ్రహ్మాజీ-విజయదుర్గాభవానీ దంపతులు కర్తలుగా కల్యాణం నిర్వహించారు. అనంతరం స్వామివారిని గ్రామోత్సవం నిర్వహించారు. అన్నసమారాధన నిర్వహించారు.

టీడీపీ బలోపేతానికి పనిచేసే వారికే పదవులు

- ఎన్నికల పరిశీలకుడు నరసింహారావు
- టీడీపీ సంస్థాగత ఎన్నికల నిర్వహణ




రాజోలు: మాట్లాడుతున్న టీడీపీ మండల ఎన్నికల పరిశీలకుడు నరసింహారావు, పి.గన్నవరం: లంకలగన్నవరంలో నూతన గ్రామశాఖ అధ్యక్ష, కార్యదర్శులతో డొక్కా నాథ్‌బాబు

రాజోలు, జూన్ 8(ఆంధ్రజ్యోతి): రాజోలు నియోజకవర్గం టీడీపీకి కంచుకోట అని, పార్టీ కోసం పనిచేసే వ్యక్తులను మాత్రమే పదవుల్లో నియమించాలని టీడీపీ మండల ఎన్నికల పరిశీలకుడు తాడి నరసింహారావు అన్నారు. స్థానిక అంబేడ్కర్ కమ్యూనిటీ భవనంలో సెంట్రల్ డెల్టా ప్రాజెక్టు చైర్మన్ గుబ్బల శ్రీనివాస్ అధ్యక్షతన ఆదివారం జరిగిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. టీడీపీ సంస్థాగత ఎన్నికలు వెంటనే పూర్తి చేయాలని పిలుపునిచ్చారు.

టీడీపీ ఇన్‌చార్జిని నియమించండి

రాజోలు నియోజకవర్గానికి టీడీపీ ఇన్‌చార్జిని తక్షణమే నియమించాలని నాయకులు, కార్యకర్తలు ఎన్నికల పరిశీలకుడు నరసింహారావు దృష్టికి తీసుకువెళ్లారు. ఈవిషయం పార్టీ అధిష్టానం దృష్టిలో ఉందని, త్వరలో నియమిస్తారని ఆయన తెలిపారు. ఎంపీపీ కేతా శ్రీను, పెద్దాపురం నియోజకవర్గ టీడీపీ పరిశీలకుడు బోళ్ల వెంకటరమణ, చాగంటి స్వామి, వైస్ ఎంపీపీ పొలమూరి శ్యామ్‌బాబు, కాండ్రేగుల లావణ్య, మోకా పార్వతి, మటపర్తి లక్ష్మీ, పామర్తి రమణ, అడబాల విజయ్, కడలి వెంకటరమణారావు, అనుచూరి పురుషోత్తం, కోళ్ల వెంకన్న, కట్టా సూరిబాబు, కసుకుర్తి త్రినాథస్వామి, అడబాల చంటి, గుబ్బల కుమార్, రావి మురళీ, చెల్లింగి జాంబవతి, బోళ్ల రాజేష్ పాల్గొన్నారు.

గ్రామశాఖల అధ్యక్షుల నియామకం

పి.గన్నవరం, జూన్ 8(ఆంధ్రజ్యోతి): మానేపల్లి, లంకలగన్నవరం గ్రామాల్లో జరిగిన టీడీపీ సంస్థాగత ఎన్నికల్లో అధ్యక్ష, కార్యదర్శులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. లంకలగన్నవరంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డొక్కా నాథ్‌బాబు, స్థానిక నాయకుల ఆధ్వర్యంలో గ్రామశాఖ అధ్యక్షుడుగా వేమన రామకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా రాపాక శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా మట్టపర్తి రామకృష్ణలను ఎన్నుకున్నారు. మానేపల్లిలో రాష్ట్ర టీడీపీ కార్యదర్శి బోళ్ల ప్రసాద్ స్థానిక నాయకుల ఆధ్వర్యంలో జరిగిన ఎన్నికలో అధ్యక్షుడిగా యల్లమిల్లి రామ్మోహనరావు, ప్రధాన కార్యదర్శిగా పితాని శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడిగా మెల్లేటి రాంబాబును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీటీసీ అవనిగడ్డ సత్తిబాబు, పెచ్చెట్టి వీరవెంకటసత్యనారాయణ, లంకే చిరంజీవి, గనిశెట్టి ఈశ్వర్, డొక్కా బాబులు, గూటం రత్నంరాజు, మద్దుల అనురాజేశ్వరి, యర్రంశెట్టి నాగేశ్వరరావు, పైడి బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

పార్టీ పటిష్టానికి కృషి చేయాలి

మామిడికుదురు, జూన్ 8(ఆంధ్రజ్యోతి): టీడీపీకి నూతన గ్రామశాఖలు ఏర్పాటుచేసి పార్టీ పటిష్టానికి కృషి చేస్తున్నామని జడ్పీ మాజీ చైర్మన్ నామన రాంబాబు పేర్కొన్నారు. మగటపల్లిలో గ్రామశాఖ కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. గ్రామశాఖ అధ్యక్షుడిగా కుంపట్ల వెంకటసుబ్బారావు, ఉపాధ్యక్షుడిగా కట్టా ధర్మరాజు, ప్రధాన కార్యదర్శిగా భూపతి శ్రీనివాసరావు, కోశాధికారిగా నామన ఆంజనేయస్వామిలను ఎన్నుకున్నారు. యూనిట్ ఇన్‌చార్జిగా కుంచే శ్రీనివాస్, బూత్ కన్వీనర్లగా మానేపల్లి రామకృష్ణ, బొంతు రవివర్మ, నామన సూర్యనారాయణమూర్తి, బొలిశెట్టి నాగభూషణం, తెలుగు యువత అధ్యక్షుడిగా సాయిదుర్గా వరప్రసాద్‌లను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నామన నాగేశ్వరరావు, యాలంగి బాపూజీ, చెల్లింగి సింహాచలం, కండెళ్ల రామకృష్ణ, చెల్లుబోయిన రామకృష్ణ, బొంతు అబ్బు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలను బాధ్యతగా చేపట్టండి

మలికిపురం, జూన్ 8(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ సంస్థాగత ఎన్నికల్లో ప్రతీ ఒక్కరూ బాధ్యతగా పాల్గొనాలని పార్టీ మండల పరిశీలకుడు మట్టా మహాలక్ష్మీప్రభాకర్ అన్నారు. ఆదివారం అడబాల యుగంధర్ అధ్యక్షతన లక్కవరంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జూన్ 15 నాటికి గ్రామ కమిటీ, బూత్ కమిటీ, కుటుంబ సాధికార సారథుల నియామకం పూర్తి చేయాలన్నారు. కష్టపడి పనిచేసే వారిని మాత్రమే ఎన్నుకోవాలన్నారు. కార్యక్రమంలో చిటికెన రామ్మోహనరావు, మంగెన భూదేవి, కందికట్ల నిర్మల, అడబాల సాయిబాబు, గుబ్బల శ్రీనివాస్, కాకి లక్ష్మణ్, మంగెన నాని, చాగంటి స్వామి, జంపన సత్యనారాయణరాజు, సత్యనారాయణ, హెలీన, దుర్గాదేవి, రమాదేవి, అనంతలక్ష్మి, యెనుముల నాగు, బోనం సాయిరామ్ తదితరులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం: జేసీ



అమలాపురంలో యోగాసనాలు వేస్తున్న జేసీ నిషాంతి, ఎమ్మెల్యే ఆనందరావు తదితరులు

అమలాపురం టౌన్, జూన్ 8(ఆంధ్రజ్యోతి): భారతీయ సనాతన వారసత్వ సంపదగా వచ్చిన యోగాను ప్రజలంతా ఆచరిస్తూ సంపూర్ణ ఆరోగ్యం పొందే దిశగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా యోగా మాసోత్సవాలను నిర్వహిస్తుందని జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి పేర్కొన్నారు. ఆదివారం అమలాపురం 2వ వార్డులోని డాక్టర్ మెట్ల సత్యనారాయణరావు ఆరోగ్య ఉద్యానవనంలో వయోవృద్ధుల యోగాభ్యాసన కార్యక్రమాన్ని 45నిమిషాల పాటు నిర్వహించారు. అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి యోగాసనాలు వేశారు. ఈసందర్భంగా జేసీ మాట్లాడుతూ తనువు, మనసును ఏకంచేసి సుసంపన్న ఆరోగ్యానికి బాటలువేసే యోగాతో దేశ దారుఢ్యంతో పాటు మానసిక ఆరోగ్యం సొంతమవుతుందని పేర్కొన్నారు. ఎమ్మెల్యే ఆనందరావు మాట్లాడుతూ ప్రజలు తమ జీవన శైలిలో యోగాను అంతర్భాగం చేసుకుంటే ఆరోగ్యవంతమైన సమాజం ఆవిర్భవిస్తుందన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో కె.మాధవి, కలెక్టరేట్ పరిపాలనాధికారి కడలి కాశీవిశ్వేశ్వరరావు, తహశీల్దార్‌లు పలివెల అశోక్‌ప్రసాద్, వాసా ఎస్.దివాకర్, మున్సిపల్ కమిషనర్ బి.రాణిసంయుక్త, ఆశెట్టి ఆదిబాబు, బోనం సత్యవరప్రసాద్, చొల్లంగి సత్యసాయిబాబా, పప్పుల శ్రీరామచంద్రమూర్తి, కౌన్సిలర్ ఏడిద శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఒత్తిడితో పోరాడే వారికి యోగా సుస్థిర మార్గం

రాజోలు, జూన్ 8(ఆంధ్రజ్యోతి): యోగా కేవలం వ్యాయామం మాత్రమే కాదని శరీరం, మనస్సు, ఆత్మను సమానపరిచే జీవన శైలి అని రాజోలు ఏపీఎం వర్మ అన్నారు. రాజోలు మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో అధ్యక్షులు ఆర్.సత్యవేణి, సీహెచ్ నాగలక్ష్మి అధ్యక్షతన సంఘ సభ్యులు, వీవోఏలతో యోగా కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగాంధ్రప్రదేశ్ సాధనలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం యోగాంధ్ర-2025 అనే ప్రత్యేక కార్యక్రమంలో ద్వారా యోగా చైతన్యాన్ని సమగ్రంగా విస్తరిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో సీసీలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సాక్షి చానల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా సాక్షి చానల్‌పై పలు చోట్ల ఫిర్యాదులు



రాజోలు ఎస్ఐ రాజేష్‌కుమార్‌కు ఫిర్యాదు అందజేస్తున్న టీడీపీ మహిళలు

ముమ్మిడివరం, జూన్ 8(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి వేశ్యల రాజధానిగా అభివర్ణించిన జర్నలిస్టు కృష్ణంరాజు, సాక్షి ఎడిటర్ కొమ్మినేని శ్రీనివాసరావు, ఆ చానల్ ఎండీ వైఎస్ భారతిరెడ్డిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ముమ్మిడివరానికి చెందిన టీడీపీ మహిళలు ఆదివారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అమరావతి మహిళల మనోభావాలను దెబ్బతీసే విధంగా వ్యాఖ్యానించిన వారిపై కేసు నమోదుచేసి చట్టపరంగా కఠినంగా శిక్షించాలని పేర్కొంటూ టీడీపీ మండలాధ్యక్షుడు అర్థాని శ్రీనివాసరావు ఆధ్వర్యంలో తెలుగు మహిళలు మెండి కమల, బొక్కా రుక్మిణి, మట్టపర్తి ఈశ్వరి, అత్తిలి ప్రసన్న, కురసాల శివబాబులతో పాటు పలువురు ముమ్మిడివరం ఎస్ఐ డి.జ్వాలాసాగర్‌కు ఫిర్యాదు చేశారు.

జగన్ బేషరతుగా క్షమాపణ చెప్పాలి

రాజోలు, జూన్ 8(ఆంధ్రజ్యోతి): ఇటీవల సాక్షి చానల్‌లో కొమ్మినేని శ్రీనివాసరావు లైవ్ షోలో వేశ్యల రాజధాని అమరావతి అని విశ్లేషకుడు కృష్ణంరాజు మాట్లాడడం చాలా బాధాకరమని తెలుగు మహిళ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంగెన భూదేవి అన్నారు. సాక్షి చానల్‌పై చర్యలు తీసుకోవాలని తెలుగు మహిళలు రాజోలు పోలీసుస్టేషన్‌లో ఆదివారం ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో తాడి నరసింహారావు, బందెల పద్మ, కాండ్రేగుల లావణ్య, ఎంపీపీ కేతా శ్రీను, డెల్టా ప్రాజెక్టు చైర్మన్ గుబ్బల శ్రీనివాస్, చాగంటి స్వామి, సర్పంచ్ చెల్లుబోయిన హెలినా, కడలి దుర్గాదేవి, అడబాల రమాదేవి, ముప్పర్తి నాని, చెల్లింగి జాంబవతి, మటపర్తి లక్ష్మి, కడలి సునీత, చింతపల్లి నాగలక్ష్మి, కడలి పద్మ తదితరులు పాల్గొన్నారు.

మహిళల గౌరవానికి భంగం

పి.గన్నవరం, జూన్ 8(ఆంధ్రజ్యోతి): సాక్షి తెలుగు చానల్ లైవ్‌షోలో వేశ్యల రాజధాని అమరావతి అంటూ వ్యాఖ్యానించడం ఆ ప్రాంత మహిళల గౌరవానికి భంగం కల్గించిందని టీడీపీ తెలుగు మహిళలు మండిపడ్డారు. ఈకార్యక్రమానికి కారుకులైన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎస్ఐ బి.శివకృష్ణకు మండలంలోని టీడీపీ మహిళ నాయకులు వినతిపత్రం అందించారు. సర్పంచ్‌లు బొండాడ నాగమణి, కుంపట్ల నాగలక్ష్మి, వైస్ ఎంపీపీ చెల్లిబోయిన గంగాదేవి, మాజీ ఎంపీపీలు అంబటి భూలక్ష్మి, సంసాని లక్ష్మీగౌరి, ఎంపీటీసీలు పులపర్తి చినవెంకటలక్ష్మి, కొక్కిరి లక్ష్మి, మద్దుల అనూరాజేశ్వరి పాల్గొన్నారు.

ఘనంగా స్వాతి నక్షత్రపూజలు



అంతర్వేది, జూన్ 8(ఆంధ్రజ్యోతి): అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామివారి ఆలయంలో ఆదివారం ఘనంగా స్వాతి నక్షత్ర పూజలు జరిపారు. తొలుత అర్చకులు బంగారు కలశను శిరస్సుపై ధరించి ఆలయ ప్రదక్షిణ చేశారు. ముందుగా 108కలశాలతో విశేష అభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అర్చకులు ఆలయ పురాతన కల్యాణ మండపం వద్ద అష్టోత్తర శత కలశాభిషేకం చేసి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

బీఎల్డీసీ సీలింగ్ ఫ్యాన్ల అందజేత

అమలాపురం రూరల్, జూన్ 8(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎనర్జీ కన్సర్వేషన్ మిషన్ సామాజిక బాధ్యతలో భాగంగా అమలాపురం ఆర్టీసీ బస్‌స్టేషన్‌లో ప్రయాణికుల సౌకర్యార్థం బీఎల్డీసీ సీలింగ్ ఫ్యాన్లను అందజేశారు. 28 సీలింగ్ ఫ్యాన్లను ఆర్టీసీ డిపోలో మొదటి విడతగా ఆదివారం బిగించినట్టు డీపో మేనేజర్ చల్లా సత్యనారాయణమూర్తి తెలిపారు. తక్కువ విద్యుత్ వినియోగంతో పాటు పర్యావరణ పరిరక్షణ బీఎల్డీసీ ఫ్యాన్లు ఎంతగానో దోహదపడతాయని పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

అమలాపురంరూరల్, జూన్ 8(ఆంధ్రజ్యోతి): రొళ్లపాలెంలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో యార్లగడ్డ శామ్యూల్ రాజ్ (22) అక్కడి కక్కడే మృతిచెందాడు. మోటార్‌సైకిల్‌పై వెనుక ఉన్న కాట్రగడ్డ ప్రదీప్ తీవ్రంగా గాయపడ్డాడు. వీరు యానాం వైపు నుంచి పి.గన్నవరం మండలం పందాలపాలెం వెళ్తుండగా రొళ్లపాలెంలో గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో శామ్యూల్‌రాజ్ మృతిచెందాడు. ప్రదీప్ గాయపడ్డాడు. పట్టణ సీఐ పి.వీరబాబు సంఘటన స్థలానికి చేరుకుని కేసు దర్యాప్తు చేపట్టారు.

వంగవీటి మోహనరంగా అందరివాడు

అంతర్వేదిలో రంగా విగ్రహం ఆవిష్కరణ



అంతర్వేదిలో రంగా విగ్రహం ఆవిష్కరణ దృశ్యం

అంతర్వేది, జూన్ 8(ఆంధ్రజ్యోతి): పేద, బడుగు బలహీనవర్గాల ఆశాజ్యోతి వంగవీటి మోహనరంగ అని తీర ప్రాంత గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు అన్నారు. ఆదివారం అంతర్వేది కొత్తపేట సెంటర్‌లో రంగా విగ్రహాన్ని నాలుగు గ్రామాల ప్రజాప్రతినిధులు ఆవిష్కరించారు. కొన్ని రోజులుగా వివాదాస్పదంగా మారిన రంగా విగ్రహం ఏర్పాటు ఆదివారం కొలిక్కి వచ్చింది. గ్రామస్తులు ఏర్పాటు చేసిన రంగా విగ్రహాన్ని అన్ని సామాజికవర్గాలు సంయుక్త నిర్వహణలో ఆవిష్కరించారు. సర్పంచ్‌లు ఒడుగు శ్రీను, కొండా జాన్‌బాబు, పోతురాజు నరసింహారావు(కిశోర్), దొండపాటి రవికుమార్, మేడిద మోహన్, ఎంపీటీసీ సభ్యులు బైరా నాగరాజు, చొప్పల బాబూరావు, ఉండపల్లి అంజి, రావూరి నాగు, జిల్లెల్ల నరసింహ (రక్షక్), స్థానిక యువనాయకులు, రంగా అభిమానులు, కలిదిండి, ప్రకాశపురం, కొత్తపేట నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సంస్థాగత ఎన్నికల్లో యువతకు ప్రాధాన్యం ఇవ్వండి



అంతర్వేది, జూన్ 8(ఆంధ్రజ్యోతి): సంస్థాగత ఎన్నికల్లో యువతకు ప్రాధాన్యత ఇవ్వాలని పరిశీలకుడు మందాల గంగసూర్యనారాయణ అన్నారు. అంతర్వేదిపాలెం గ్రామంలో అల్లూరి సూర్యనారాయణరాజు ఇంటి వద్ద పార్టీ మండల అధ్యక్షుడు ముప్పర్తి నాని అధ్యక్షతన సంస్థాగత సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా గంగసూర్యనారాయణ, నియోజకవర్గ పరిశీలకుడు చిటికెల రామ్మోహనరావు పాల్గొన్నారు. ఈసందర్భంగా గంగసూర్యనారాయణ మాట్లాడుతూ సంస్థాగతంగా పార్టీని బలోపేతం చేయాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందన్నారు. 12వ తేదీ నాటికి గ్రామశాఖ కమిటీలు, బూత్ కమిటీలు, కుటుంబ సాధికార సారథులను నియమించుకోవాలన్నారు. 15వతేదీ నాటికి మండల పార్టీ కమిటీలను పూర్తి చేయాలన్నారు. డెల్టా చైర్మన్ గుబ్బల శ్రీనివాస్, తాడి సత్యనారాయణ, చాగంటి స్వామి, బత్తుల రాము, కౌరు శ్రీనివాస్, చెల్లింగి లీలామోహన్‌శ్రీనివాస్, అంతర్వేదిపాలెం పుల్లయ్యపోతురాజు కృష్ణ, తిరుమాని ఆచార్యులు, నాయకులు పాల్గొన్నారు.

ప్రైమ్ వాలీబాల్ టోర్నిలో యానాం క్రీడాకారుడు

- చెన్నై జట్టులో స్థానం
- వేలంలో రూ.3లక్షలు



యానాం, జూన్ 8(ఆంధ్రజ్యోతి): యానాం సీతమ్మపేటకు చెందిన వాలీబాల్ క్రీడాకారుడు కైలా విష్ణువర్ధన్‌బాబు ప్రైమ్ వాలీబాల్ టోర్నికి ఎంపికయ్యాడు. దేశంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే ప్రైమ్ వాలీబాల్ క్రీడాకారుల ఎంపిక కోసం ఆదివారం వేలం పాట నిర్వహించారు. ఈపాటలో యానాం క్రీడాకారుడు విష్ణువర్ధన్‌బాబు రూ.మూడు లక్షలతో చెన్నై బ్లిట్జ్ జట్టులో స్థానం దక్కించుకున్నాడు. పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు, పలువురు క్రీడా ప్రతినిధులు ఫోన్ చేసి అభినందనలు తెలిపారు. అదేవిదంగా గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు.

ట్రాఫిక్ ఇబ్బందులు



గడియారస్తంభం సెంటర్‌లో వన్‌వేలో వస్తున్న కారు ఫొటో తీస్తున్న కానిస్టేబుల్

అమలాపురం టౌన్, జూన్ 8(ఆంధ్రజ్యోతి): వన్‌వే.. అసలే ట్రాఫిక్ ఎక్కువగా ఉండే సమయం. సరిగ్గా అదే సమయంలో రాంగ్ రూట్‌లో కార్లు, ఇతర పెద్ద వాహనాలు వస్తే ట్రాఫిక్ ఎక్కడికక్కడ స్తంభించిపోతుంది. ఆదివారం సాయంత్రం అమలాపురం గడియార స్తంభం సెంటర్‌లో ట్రాఫిక్ కానిస్టేబుల్ వీరబాబు ఆన్‌డ్యూటీలో ఉన్నారు. అంతే ముమ్మిడివరం గేట్ సెంటర్ నుంచి గడియారస్తంభం సెంటర్‌కు రాంగ్ రూట్‌లో వస్తున్న కార్లు ఇతర పెద్ద వాహనాలకు ఫొటోలు తీయడం ప్రారంభించారు. దాంతో కారు డ్రైవర్లు ఒకింత ఆందోళనకు గురయ్యారు. ఎందుకంటే తీసిన ఫొటోలు అప్‌లోడ్ అయితే ఒక్కో వాహనానికి రూ.వెయ్యి నుంచి రూ.1500వరకు చలానా కట్టాల్సిన పరిస్థితి.

ఎమ్మార్పీఎస్ కమిటీలను పునర్నిర్మించాలి



ఎమ్మార్పీఎస్ సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జి మధు

అమలాపురం రూరల్, జూన్ 8(ఆంధ్రజ్యోతి): క్షేత్రస్థాయిలో ఎమ్మార్పీఎస్ కమిటీలను పునర్నిర్మాణం చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని జిల్లా ఇన్‌చార్జి కేబీ మధు పేర్కొన్నారు. పేరూరులో ఆదివారం ఆకుమర్తి రమేష్ అధ్యక్షతన జిల్లా స్థాయి ఎమ్మార్పీఎస్ నాయకుల సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణకు శ్రీకారం చుట్టినందున మాదిగ అనుబంధ కులాలకు పూర్తిస్థాయిలో న్యాయం జరిగేందుకు కృషి చేయాల్సిన ఆవశ్యకతను వివరించారు. కోఇన్‌చార్జి సూరి, ఎమ్మార్పీఎస్ జిల్లాశాఖ అధ్యక్షుడు సవరపు భైరవస్వామి కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. సమావేశంలో వివిధ మండలాల ప్రతినిధులు ఆకుమర్తి మోహన్, సత్తాల దుర్గారావు, మంద దుర్గారావు, చుట్టుగుళ్ల సత్తిబాబు, నేదునూరి లక్ష్మణ్, సీహెచ్ మహేష్, గిడ్డ సత్యనారాయణ, గెద్దాడ సత్యనారాయణ, ఎస్.దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి ఉపకార వేతనానికి కావ్య ఎంపిక



అమలాపురం టౌన్, జూన్ 8(ఆంధ్రజ్యోతి): అమలాపురం జిల్లాపరిషత్ బాలికోన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న సీలి కావ్య జాతీయస్థాయిలో నిర్వహించిన ఎన్ఎంఎంఎస్ ఉపకార వేతనాల ఎంపిక పరీక్షలో అత్యధికంగా 118 మార్కులు సాధించినట్టు హెచ్ఎం విజయకుమారి తెలిపారు. కావ్యను క్లాస్ టీచర్ సుబ్బలక్ష్మి, వెంకటేశ్వర డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ కేవీఆర్ఎన్ నరసింహారావు, ప్రిన్సిపాల్ కేఎస్ వీఎస్ మనోహర్, కరాటం ప్రవీణ్ తదితరులు అభినందించారు.

కలెక్టర్ కుమారుడికి అక్షరాభ్యాసం



అంతర్వేది, జూన్ 8(ఆంధ్రజ్యోతి): అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామివారి ఆలయానికి కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ ఆదివారం కుటుంబ సమేతంగా విచ్చేశారు. వారికి ఆలయ అర్చకులు ఘన స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం అనంతరం స్వామివారి సన్నిధిలో వారి కుమారుడి అక్షరాభ్యాసం కార్యక్రమాన్ని ఆలయ అర్చకులు జరిపించారు. అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆశీస్సులు అందరికీ ఉండాలని ఆయన ఆకాంక్షించారు. అక్షరాభ్యాసం అనంతరం కలెక్టర్ దంపతులకు అర్చకులు వేదాశీర్వచనం చేసి స్వామివారి చిత్రపటం, ప్రసాదాన్ని అందించారు కార్యక్రమంలో ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నగదు ప్రోత్సాహక బహుమతులు

అంబాజీపేట, జూన్ 8(ఆంధ్రజ్యోతి): ఆలమూరు మండలం చెముడులంకకు చెందిన వీరవినోద్ జేఈఈలో మంచి ర్యాంకు, పశ్చిమగోదావరి జిల్లా ఆరుగొలనుకు చెందిన బాలసాయి రాహుల్ పదో తరగతిలో మంచి మార్కులు సాధించాడు. తండ్రి వెంకటనారాయణ జ్ఞాపకార్థం రూ.5వేలు వంతున, ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలను విద్యార్థులకు జిల్లా పౌరసరఫరా అధికారి అడపా ఉదయభాస్కర్ అందించారు. కార్యక్రమంలో ఆదిత్యాకిరణ్, అడపా శివయ్య, బాబ్జి, కళ్యాణ్, శిరిగినీడి వెంకటేశ్వరరావు, యేడిద శ్రీను, అరిగెల సూరిబాబు, ఎస్వీ నాయుడు, నాగార్జున పాల్గొన్నారు.

ఏరియా ఆసుపత్రిని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తా



ఏరియా ఆసుపత్రి ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆనందరావు

అమలాపురం టౌన్, జూన్ 8(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రమైన అమలాపురం ఏరియా ఆసుపత్రిని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసేందుకు అవసరమైన అన్నిచర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు పేర్కొన్నారు. ఆదివారం ఏరియా ఆసుపత్రిని ఆయన సందర్శించి ప్రాంగణాన్ని పరిశీలించారు. స్వచ్ఛతకు చిరునామాగా ఏరియా ఆసుపత్రిని అభివృద్ధి చేయాలన్నారు. రోగులకు అవసరమైన మందులు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంచడంతో పాటు అవసరమైన అన్నిపరీక్షలు నిర్వహించే విధంగా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. వైద్య సిబ్బంది కొరత తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. టీడీపీ పట్టణఅధ్యక్షుడు తిక్కిరెడ్డి నేతాజీ, వలవల శివరావు, ఆవుపాటి గోపాల్, నల్లా చిట్టిబాబు, పలచోళ్ల పద్మనాభంపాల్గొన్నారు.

ముగిసిన సెంటాక్ దరఖాస్తుల స్వీకరణ

యానాం, జూన్ 8(ఆంధ్రజ్యోతి): పుదుచ్చేరిలోని వివిధ కళాశాలల్లో ప్రొఫెషనల్ కోర్సులకు సెంటాక్ (సెంట్రలైజ్డ్ అడ్మిషన్ కమిటీ) ఆధ్వర్యంలో ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ గడువు ముగిసింది. 2025-26 విద్యా సంవత్సరానికి బీటెక్, బీఆర్క్, బీఎస్సీ, బీపీటీ, అగ్రికల్చర్ తదితర పారా మెడికల్ కోర్సులు, ఆర్ట్స్, సైన్సు కోర్సుల్లో ప్రవేశానికి అభ్యర్థుల నుంచి 13,526 దరఖాస్తులు స్వీకరించారు. అలాగే బీఎస్సీ నర్సింగ్ కోర్సులో ప్రవేశ పరీక్షకు ఆన్‌లైన్‌లో 2211మంది దరఖాస్తు చేసుకున్నారు. వీటిలో పుదుచ్చేరి 1611, కారైకాల్ 464, మాహే 82, యానాం 54మంది దరఖాస్తు చేసుకున్నారు. సెంటాక్ సంబంధించి మెరిట్ జాబితాను త్వరలో ప్రదర్శిస్తామని చెప్పారు. వివరాలకు సెంటాక్ వెబ్‌సైట్ నుంచి పొందవచ్చన్నారు.

శివాలయానికి రూ.లక్ష విరాళం

మలికిపురం, జూన్ 8(ఆంధ్రజ్యోతి): మోరి శ్రీసీతారామలింగేశ్వర ఆలయ పునఃనిర్మాణానికి ఉప్పుగంటి అప్పారావు, లక్ష్మీభాస్కరమ్మలు రూ.లక్షా 116 విరాళంగా అందించారు. కార్యక్రమంలో అడ్డాల బాబ్జి, కామిశెట్టి సూరన్న, మాలే సత్యనారాయణలు పాల్గొన్నారు.

కార్డియాలజీ వైద్యవిద్యను అభ్యసించడమే లక్ష్యం

ఈఏపీ సెట్‌లో వినాయక్‌అభిరామ్‌కు 29వ ర్యాంకు



అమలాపురం టౌన్, జూన్ 8(ఆంధ్రజ్యోతి): ఆదివారం విడుదలైన ఏపీ ఈఏపీ సెట్-2025 ప్రవేశ పరీక్షా ఫలితాల్లో అమలాపురం యర్రమిల్లివారి వీధికి చెందిన కొప్పినీడి వినాయక్‌అభిరామ్ రాష్ట్రస్థాయిలో 29వ ర్యాంకు సాధించాడు. అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ విభాగంలో అభిరామ్ 29వ ర్యాంకు సాధించడం పట్ల తల్లిదండ్రులు డాక్టర్ కొప్పినీడి వెంకటరమణ కుమార్-పార్వతీదేవి దంపతుల ఆనందం వ్యక్తం చేశారు. విజయవాడ గోశాల శ్రీచైతన్య కళాశాలలో ఇంటర్ బైపీసీ చదివిన అభిరామ్‌కు 983 మార్కులు వచ్చాయి. పేదలకు సేవలు అందించాలన్న లక్ష్యంతో వైద్య వృత్తిలో చేరాలనుకున్నట్టు చెప్పాడు. కార్డియాలజీ విభాగంలో అత్యున్నత వైద్య నైపుణ్యంసాధించాలన్నదే లక్ష్యమని అభిరామ్ పేర్కొన్నాడు.

కంప్యూటర్ సైన్స్‌లో ఇంజనీరింగ్ చేయడమే లక్ష్యం

ఈఏపీ సెట్‌లో వంక సాయిశ్రీరామ్‌సాత్విక్‌కు 62వ ర్యాంకు



అమలాపురం రూరల్, జూన్ 8(ఆంధ్రజ్యోతి): ఏపీ ఈఏపీ సెట్-2025 ప్రవేశ పరీక్షా ఫలితాల్లో ఇంజనీరింగ్ విభాగంలో ఇందుపల్లి గ్రామానికి చెందిన వంక సాయిశ్రీరామ్‌సాత్విక్ 62వ ర్యాంకు సాధించాడు. తండ్రి వెంకటసతీష్ ఉపాధి నిమిత్తం గల్ఫ్ దేశం ఖతర్‌లో ఉండగా తల్లి రామసీత గృహిణి. విజయవాడ శ్రీచైతన్యలో ఇంటర్ ఎంపీసీ చదివిన సాత్విక్ 972 మార్కులు సాధించాడు. జేఈఈ మెయిన్స్‌లో 130వ ర్యాంకు, జేఈఈ అడ్వాన్స్‌లో 261వ ర్యాంకును ఆలిండియా ఓపెన్ కేటగిరిలో సాధించాడు. కంప్యూటర్ విద్యను అభ్యసించి అత్యాధునిక టెక్నాలజీ నైపుణ్యాలను అభివృద్ధి చేయడమే లక్ష్యమని సాత్విక్ అన్నాడు.

మెడిసిన్ చదువుతా

ఏపీసెట్‌లో లంకే అభిషేక్‌కు 39వ ర్యాంకు



ఉప్పలగుప్తం, జూన్ 8(ఆంధ్రజ్యోతి): ఉప్పలగుప్తం మండలం ఎస్.కొత్తపల్లికి చెందిన లంకే అభిషేక్ ఏపీ ఈఏపీసెట్‌లో 39వ ర్యాంకు సాధించాడు. మెడిసిన్ చదవడం తన అభిలాష అని రైతు కుటుంబానికి చెందిన అభిషేక్ ఆంధ్రజ్యోతికి తెలిపాడు. తీరప్రాంత గ్రామంలో జన్మించిన అభిషేక్ రాజమహేంద్రవరంలో చదువుకున్నాడు. కాగా నీట్‌లో తనకు 587/720 మార్కులు వచ్చినట్టు తెలిపాడు. అయితే ఇంకా ర్యాంకు ప్రకటించవలసి ఉందన్నాడు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

అమలాపురం రూరల్, జూన్ 8(ఆంధ్రజ్యోతి): మోటారుసైకిల్ సడన్ బ్రేక్ వేయడంతో వాహనం స్కిడ్ అయి రోడ్డుపై పడ్డ మోటారుసైక్లిస్టు అపస్మారకస్థితిలోకి చేరి అమలాపురం కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. బండారులంక కాపటివీధికి చెందిన తిల్లపూడి దుర్గాప్రసాద్ (34) తాపీ పని చేసుకుని జీవిస్తున్నాడు. ఆదివారం ఉదయం పని లేకపోవడంతో అమలాపురం వైపు వెళుతుండగా స్థానిక ఎగ్జిబిషన్ సెంటర్‌లో ఏజీ రోడ్డుపై మోటారు సైకిల్ స్కిడ్ అయి రోడ్డుపై పడ్డాడు. తలకు, చెవి పక్కన గాయాలయ్యాయి. అప్పటికే అపస్మారకస్థితిలో ఉన్న దుర్గాప్రసాద్‌ను కిమ్స్ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు అమలాపురం తాలూకా పోలీసులు ఆసుపత్రికి చేరుకున్నారు. భార్య లక్ష్మీదుర్గ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ వై.శేఖర్‌బాబు తెలిపారు.

మోటార్‌సైక్లిస్టుకు గాయాలు

అంబాజీపేట, జూన్ 8(ఆంధ్రజ్యోతి): ముక్కామల ప్రధాన రహదారిలో ఆటో, మోటార్‌సైకిల్ ఢీకొనడంతో మోటార్‌సైక్లిస్టుకు తీవ్రగాయాలయ్యాయి. రావులపాలెం నుంచి ముక్కామల వైపు వస్తున్న ఆటో కొత్తపేట వైపు వెళ్తున్న మోటార్‌సైకిల్ ఢీకొన్నాయి. మోటార్‌సైకిలిస్టుకు గాయాలు కావడంతో అమలాపురం ఆసుపత్రికి తరలించారు. ఈవిషయంపై పోలీసులకు సమాచారం అందించినట్లు తెలిపారు.

పర్యావరణ పరిరక్షణకు ప్రతీ ఒక్కరూ కృషిచేయాలి

మామిడికుదురు, జూన్ 8(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీవేమా పిలుపునిచ్చారు. ప్రధాని నరేంద్ర మోదీ పిలుపుతో అమ్మకు గుర్తుగా మొక్కలు నాటే కార్యక్రమంలో భాగంగా అప్పనపల్లిలో ఆదివారం మొక్కలు నాటారు. మండలశాఖ అధ్యక్షుడు బైరిశెట్టి దుర్గారామకృష్ణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాట్లాడారు. మొక్కలు నాటే కార్యక్రమం ఆగస్టు 15 వరకు జరుగుతుందన్నారు. కంకిపాటి సుబ్బారావు, పసుపులేటి మహాలక్ష్మీరావు, కోటిపల్లి సాయిబాబు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట


చెల్లూరులో అభివృద్ధి పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు

ఎమ్మెల్యే వేగుళ్ల

రాయవరం, జూన్ 8(ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. ఆదివారం చెల్లూరు గ్రామంలో అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే భూమిపూజ జరిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వైసీపీ పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో వెనకబడిపోయిందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేస్తూనే అభివృద్ధి, సంక్షేమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు పెద్దపీట వేస్తున్నారన్నారు. గ్రామాల్లో పర్యటించిన ఎమ్మెల్యేకు టీడీపీ నాయకులు, కార్యకర్తలు స్వాగతం పలికారు. ఈసందర్భంగా గ్రామం లో రూ.70 లక్షలతో దంప కాలనీ, చినవాకలి, పెద్దవాకలి, కృష్ణమ్మ చెరువు, ఎర్రమట్టిపురం, తూర్పుపేట, మసీదు సెంటర్ తదితర ప్రాంతాల్లో నిర్మించనున్న డ్రైన్లు, సీసీ రోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. ఇటీవల అగ్ని ప్రమాదంలో నష్టపోయిన దేవు కృష్ణారావును ఎమ్మెల్యే పరామర్శించారు. కార్యక్రమంలో టీడీపీ గ్రామశాఖ అధ్యక్షుడు చుండ్రు వీర్రాజు, మాజీ సర్పంచ్‌లు నూనె ఏసుబాబు, నూనె శ్రీదేవి, మోరంపూడి రాజ్‌కుమార్, మాజీ వైస్ ఎంపీపీ దేవు వెంకట్రాజు, ఎంపీటీసీ గొల్లపల్లి అనురాధ తదితరులు పాల్గొన్నారు.


రామచంద్రపురంలో వయో వృద్ధుల యోగాభ్యాసనంలో పాల్గొన్న ఆర్డీవో అఖిల

సనాతన సంప్రదాయం అందించిన బహుమతి యోగా

ఆర్డీవో అఖిల

రామచంద్రపురం (ద్రాక్షారామ), జూన్ 8 (ఆంధ్రజ్యోతి): భారతీయ సనాతన సంప్రదాయం అందించిన అమూల్య బహుమతి యోగా అని ఆర్డీవో దేవరకొండ అఖిల అన్నారు. ఆదివారం రామచంద్రపురం కృత్తివెంటి పేర్రాజు పంతులు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వయోవృద్ధుల యోగాభ్యాసన కార్యక్రమం నిర్వహించారు. ఆర్డీవో మాట్లాడుతూ యోగ ఒక జీవన విధానం అన్నారు. దీర్ఘకాలిక ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని యోగా పార్కుల అభివృద్ధికి చర్యలు కొనసాగుతున్నాయన్నారు. ఓంశాంతి యోగ గురువుల భాగస్వామ్యంతో వయో వృద్ధుల యోగా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ ఛైర్మన్ వాసంశెట్టి సత్యం, ఎంపీడీవో కడలి పద్మజ్యోతి, ఈవోపీఆర్డీ షెలట్‌రాజు, ఓంశాంతి యోగా గురువులు పాల్గొన్నారు.

భీమేశ్వరస్వామికి మద్రాస్ హైకోర్టు న్యాయమూర్తి పూజలు


భీమేశ్వరాలయంలో పూజల్లో పాల్గొన్న మద్రాస్ హైకోర్టు న్యాయమూర్తి దంపతులు

ద్రాక్షారామ, జూన్ 8(ఆంధ్రజ్యోతి): ద్రాక్షారామ భీమేశ్వరాలయాన్ని ఆదివారం మద్రాస్ హైకోర్టు న్యాయమూర్తి ఎస్.మాల కుటుంబ సమేతంగా సందర్శించారు. న్యాయమూర్తి దంపతులకు ఆలయ అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. భీమేశ్వరస్వామివారిని, మాణిక్యాంబ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. దర్శనం అనంతరం నంది మండపంలో వారికి వేద పండితులు ఆశీర్వచనం అందజేశారు. ఆలయ సహాయ కమిషనరు అల్లు వెంకట దుర్గాభవానీ స్వామివారి ప్రసాదం వారికి అందచేశారు.

సోమేశ్వరస్వామికి పూజలు

కె.గంగవరం, (ఆంధ్రజ్యోతి): కోటిపల్లి ఛాయాసోమేశ్వరస్వామిని హైకోర్టు జడ్జి ఎన్.మాల కుటుంబ సభ్యులతో ఆదివారం సోమేశ్వరస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం బేడా మండపం లో వారికి వేద పండితులు వేదాశీర్వాదం అందజేశారు.

సాగునీటి సంఘాలతో పంట కాలువలకు మహర్దశ


చొప్పెల్ల-గుమ్మిలేరు కాలువ అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న డీసీ అధ్యక్షుడు గోపాలస్వామి

ఆలమూరు, జూన్ 8(ఆంధ్రజ్యోతి): పంట కాలువ ద్వారా సక్రమంగా ఆయా భూములకు సాగునీటిని అందించేందుకు ఇటీవల సాగునీటి సంఘాలను ఏర్పాటు చేయడంతో పంటకాలువలకు మహర్దశ వస్తున్నది. ఆరేళ్లుగా పంట కాలువలను పట్టించుకోకపోవడంతో అధ్వానంగా మారిన పంట కాలువలపై సాగునీటి సంఘాలు ప్రత్యేక శ్రద్ధ వహించి అభివృద్ధి దిశగా పరుగులు తీయిస్తున్నారు. చొప్పెల్ల లాకుల నుంచి గుమ్మిలేరు మీదుగా మండపేట వరకు ఉన్న అనేక గ్రామాలకు సాగునీటిని అందించే పంటకాలువ అభివృద్ధి పనులు ఆలమూరు సాగునీటి డీసీ అధ్యక్షుడు మెర్ల గోపాలస్వామి అధ్వర్యంలో చర్యలు చేపట్టారు. ఈ కాలువలో ఉన్న చెత్తకు కలుపు మందును పిచికారి చేయించి సాగునీటికి ఇబ్బంది కలిగించే వ్యర్థాలను తొలగించే పనులు చేయించారు. ఈ కాలువపై ఉన్న చివర భూములకు సాగునీటి ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నట్టు ఆయన తెలిపారు.


కొత్తపేట డివిజన్‌లో యోగాసనాలు వేస్తున్న సీనియర్ సిటిజన్లు

యోగా దేశ వారసత్వ సంపద

కొత్తపేట, జూన్ 8(ఆంధ్రజ్యోతి): దేశ వారసత్వ సంపదలో యోగా ఒక్కటని కొత్తపేట ఆర్డీవో పి.శ్రీకర్ అన్నారు. ఆదివారం డివిజన్ స్థాయిలో వయోవృద్ధుల యోగా అభ్యాసన కార్యక్రమం స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో జరిగింది. యోగా గురువులు ఆయుష్ వైద్య సిబ్బంది భాగస్వామ్యంతో 45 నిమిషాల పాటు నిర్వహించారు. ఆర్డీవో మాట్లాడుతూ యోగా ఒక అభ్యాసమని ఇది కేవలం శారీరక వ్యాయమం మాత్రమే కాదన్నారు. ప్రతి ఒక్కరూ యోగాను అభ్యసించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో నరేష్‌కుమార్, సర్పంచ్ బూసి జయలక్ష్మి, బూసి భాస్కరరావు, దాసరి వెంకటేశ్వరరావు, యోగా గురువులు పాల్గొన్నారు.

ర్యాలి మీదుగా వాహనాల మళ్లింపు


సైఫాన్ నిర్మాణ పనులు చేస్తున్న దృశ్యం

ఆత్రేయపురం, జూన్ 8(ఆంధ్రజ్యోతి): ఆత్రేయపురం మండలం లొల్ల- మెర్లపాలెం పరిధిలోని బ్యాంక్ కెనాల్ కాలువలో సైఫాన్ నిర్మాణ పనులు చేపట్టడంతో ఆదివారం ఆర్‌అండ్‌బీ రహదారిని తొలగించారు. రావులపాలెం నుంచి బొబ్బర్లంక ఆత్రేయపురం వాడపల్లి వెళ్లే వాహనాలు ఊబలంక సాయిబాబా గుడి వద్ద నుంచి ర్యాలి వంతెన మీదుగా లొల్ల మీదుగా వాహనాలు వెళ్లేందుకు మళ్లించినట్లు ఎస్ఐ రాము తెలిపారు. ర్యాలి సడక్ రోడ్డు మీదుగా లొల్ల చేరుకోవచ్చునన్నారు. అక్కడ నుంచి భక్తులు వాడపల్లి చేరుకోవాలన్నారు. ప్రయాణికులు సహకరించాలని కోరారు.

యోగాతో ఆరోగ్యం పదిలం

కె.గంగవరం, జూన్ 8(ఆంధ్రజ్యోతి): ప్రతిరోజూ యోగా చేయడం ద్వారా ఆరోగ్య పరిరక్షణ చేసుకోవాలని యోగా ట్రైనర్ డి.వనజ అన్నారు. మహిళా సమాఖ్య భవనంలో డ్వాక్రా మహిళలకు యోగాపై శిక్షణ ఇచ్చారు. కొన్ని ఆసనాలు వేయించారు. కార్యక్రమంలో మహిళా సమాఖ్య అధ్యక్షురాలు జి.దుర్గాదేవి, సీసీలు జి.దుర్గాప్రసాద్, పి.పద్మావతి, డ్వాక్రా సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


మహిళా సమాఖ్య భవనంలో యోగా చేస్తున్న డ్వాక్రా మహిళలు

శివాలయానికి విరాళం

మలికిపురం, జూన్ 8(ఆంధ్రజ్యోతి): మోరిసీతారామలింగేశ్వర ఆలయ పునఃనిర్మాణానికి ఉప్పుగంటి అప్పారావు, లక్ష్మీభాస్కరమ్మలు రూ. లక్షా 116 విరాళంగా అందించారు. కార్యక్రమంలో అడ్డాల బాబ్జి, కామిశెట్టి సూరన్న, మాలే సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


ర్యాలి గోపాలస్వామి ఆలయంలో సదస్యం నిర్వహిస్తున్న దృశ్యం

ఘనంగా సదస్యం

ఆత్రేయపురం, జూన్ 8(ఆంధ్రజ్యోతి): ర్యాలి జగన్మోహిని కేశవస్వామి క్షేత్రపాలకుడు గోపాలస్వామి కల్యాణోత్సవాలలో భాగంగా ఆదివారం స్వామివారికి నిత్యార్చన, అమ్మవారికి కుంకుమార్చన, సాయంత్రం నిత్యోపసన, బలిహరణ తదితర కార్యక్రమాలను నిర్వహించారు. రాత్రి సదస్యం (మహాదాశీర్వచనం) నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొనగా, ఆలయ ఈవో బీహెచ్వీ రమణమూర్తి వాటి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పంటకాలువపై అనధికార వంతెన నిర్మాణం

• రైతుల ఫిర్యాదుతో అడ్డుకున్న సాగునీటి సంఘం అధ్యక్షుడు • సాగునీటికి ఇబ్బందులు కలిగిస్తే ఊరుకోమని హెచ్చరిక

ఆలమూరు, జూన్ 8(ఆంధ్రజ్యోతి): పంట కాలువల ద్వారా సాగునీటికి ఇబ్బందులు లేకుండా చేయాలని నీటిపారుదలశాఖ చర్యలు చేపడుతుంటే వాటిపై అనధికార కట్టడాలు చేపట్టడం వల్ల సాగునీటికి ఇబ్బందిగా మారుతోంది. దీనికి ఉదాహరణగా జొన్నాడ వద్ద చొప్పెల్ల కాలువపై అనధికార వంతెన నిర్మాణం చేపట్టడంతో రైతులు సాగునీటి సంఘానికి ఫిర్యాదు చేశారు. వారి ఫిర్యాదు నేపథ్యంలో చింతలూరు సాగునీటి సంఘం అధ్యక్షుడు గారపాటి శ్రీనివాసరావు నిర్మాణం చేపడుతున్న ప్రాంతాన్ని సందర్శించి ఇలాంటి కట్టడాలను అనుమతించమని వెంటనే నిలిపివేయాలని వారికి ఆదేశాలు జారీ చేశారు. చొప్పెల్ల లాకుల వద్ద నుంచి వెదురుమూడి వరకు దాదాపు ఎనిమిది గ్రామాలకు ఈ కాలువ ద్వారా సాగునీరు అందించాల్సి ఉంది. ఈ కాలువపై ఎలాంటి అనుమతులు లేకుండా దౌర్జన్యంగా కడుతున్నట్టు పలువురు ఆరోపిస్తున్నారు. రైతులు ఈ విషయాన్ని గుర్తించి చింతలూరు సాగునీటి సంఘం అధ్యక్షుడు గారపాటికి ఫిర్యాదు చేశారు. వారి ఫిర్యాదుతో ఆయన సందర్శించి తక్షణం ఈ నిర్మాణంపై చర్యలు తీసుకోవాలని నీటిపారుదల శాఖ అధికారులను ఆయన కోరారు.


జొన్నాడ వద్ద పంటకాలువపై అనధికార వంతెన నిర్మాణం చేస్తున్న దృశ్యం

సాగునీటికి ఇబ్బంది కలిగించే కట్టడాలను అనుమతించం

గారపాటి శ్రీనివాసరావు, అధ్యక్షుడు చింతలూరు సాగునీటి సంఘం



పంట కాలువల ద్వారా ప్రతి ఎకరానికి సాగునీరు అందించాలనే లక్ష్యంతో సాగునీటి సంఘాలు పనిచేస్తున్నాయి. ఇటువంటి అక్రమ కట్టడాల వల్ల సాగునీటికి ఇబ్బందులు ఏర్పడతాయి. ఇటువంటి కట్టడాలను ఎట్టి పరిస్థితిలోను అనుమతించం. అనుమతి లేకుండా కాలువపై ఎటువంటి నిర్మాణాలు చేసినా చర్యలు తీసుకుంటాం. రైతు ప్రయోజనమే తమ లక్ష్యం.


రావులపాలెం సీఐ శేఖర్‌బాబుకు ఫిర్యాదు చేస్తున్న టీడీపీ మహిళా నాయకులు


మండపేట పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న తెలుగు మహిళలు


రామచంద్రపురంలో పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న తెలుగు మహిళా విభాగం మహిళలు


ఆలమూరు పోలీసులకు సాక్షి చానల్‌పై ఫిర్యాదు చేస్తున్న మమత

అమరావతి మహిళలను కించపర్చిన

సాక్షి చానల్‌పై చర్యలు తీసుకోవాలి

కె.గంగవరం, జూన్ 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రాజధాని అమరావతిపై నీచమైన వాఖ్యలు చేసిన వారిని, దీనిపై డిబేట్ నిర్వహించిన సాక్షి చానల్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని కూటమి నాయకులు ఆదివారం పామర్రు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా కూటమి నాయకులు పామర్రు పోలీస్‌స్టేషన్ వద్ద విలేకరులతో మాట్లాడారు. మహిళలకు వైసీపీ అధ్యక్షుడు జగన్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు రవ్వా భూషణం, సలాది రమేష్, గన్ని శ్రీనివాసు, చిర్రా రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి చానల్‌పై పోలీసులకు ఫిర్యాదు

ఆలమూరు, (ఆంధ్రజ్యోతి): అమరావతిపై దుష్ప్రచారంతోపాటు మహిళలను కించపరిచేలా వ్యాఖ్యలు చేసిన సాక్షి చానల్‌పై తెలుగు మహిళ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ జడ్పీటీసీ దండంగి మమత ఆదివారం ఆలమూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. డిబేట్‌లో పాల్గొన్న వారిపై చర్యలు తీసుకోవడంతో పాటు తక్షణం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

వారిపై చర్యలు తీసుకోవాలి

రావులపాలెం, (ఆంధ్రజ్యోతి): అమరావతి మహిళలను కించపరిచేలా ప్రచారం చేసిన సాక్షి చానల్‌పై చర్యలు తీసుకోవాలంటూ టీడీపీ మహిళా నాయకులు రావులపాలెం టౌన్ సీఐ శేఖర్‌బాబుకు ఫిర్యాదు చేశారు. మహిళలను కించపరిచేలా సాక్షి టీవీలో కొమ్మినేని శ్రీనివాస రాజు, కృష్ణంరాజులు అమరావతి మహిళల మనోస్థైర్యాన్ని దెబ్బతీశారని సంబంధిత వ్యక్తులపై కేసు నమోదు చేయాలంటూ వారిచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. కార్యక్రమంలో బి.దుర్గాలక్ష్మి, ఏ.సూర్యకుమారి, కె.రాణిదుర్గ, టీవీవీ భారతి, నామాల దుర్గ తదితరులు పాల్గొన్నారు.

తెలుగు మహిళల ఫిర్యాదు

మండపేట, (ఆంధ్రజ్యోతి): అమరావతి మహిళలపై సాక్షి చానల్‌లో అనుచిత వ్యాఖ్యలు చేసిన కొమ్మినేని శ్రీనివాసరావు, కృష్ణంరాజులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ నియోజకవర్గ తెలుగు మహిళలు ఆదివారం మండపేట పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తమ ఫిర్యాదును పట్టణ ఎస్ఐ చంటిదొరకు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ మలసాని సీతారత్నం, వాకచర్ల వాసంతి, మందపల్లి జాన్సీరాణి, మాజీ ఎంపీపీ గోసాల సుజాత, కౌన్సిలర్ చింతలపూడి కనకదుర్గ, స్థానిక టీడీపీ నేతలు జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ నల్లమిల్లి వీర్రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళలను అవమానిస్తే మట్టికొట్టుకుపోతారు

రామచంద్రపురం(ద్రాక్షారామ), (ఆంధ్రజ్యోతి): మహిళలను అవమానిస్తే మట్టికొట్టుకుపోతారని తెలుగుదేశం పార్టీ మహిళా విభాగం నాయకురాలు జాస్తి విజయలక్ష్మి అన్నారు. సాక్షి చానల్‌లో అమరావతి మహిళలను అవమానపరచిన వారిపై చర్యలు తీసుకోవాలని టీడీపీ మహిళా విభాగం నాయకులు ఆదివారం రామచంద్రపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. మహిళలను అవమానించిన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు బళ్ల లక్ష్మి, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.


ప్రత్యేక అలంకరణలో సోమేశ్వరస్వామి

సోమేశ్వరస్వామి కల్యాణం

ఆలమూరు, జూన్ 8(ఆంధ్రజ్యోతి): మడికిలోనున్న బాలాత్రిపుర సుందరీదేవి సమేత సోమేశ్వరస్వామి కల్యాణం శనివారం రాత్రి వైభవంగా జరిగింది. భక్తుల సమక్షంలో వార్షిక కల్యాణం నిర్వహించారు. ప్రధానార్చకుడు కాళ్లకూరి కామేశ్వరశర్మ, అయిలూరి బ్రహ్మన్నల పర్యవేక్షణలో రాంపల్లి విశ్వనాధ శర్మ, పట్టిసం గాంధీశర్మ వేద మంత్రాలతో జరిపించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి ఎంఎస్ఆర్ కృష్ణ అధ్వర్యంలో ఆలయంలో ప్రత్యేకంగా చేయించిన వేదికపై స్వామి కల్యాణం జరిపారు. మడికితోపాటు లంక గ్రామాల్లోని పలు గ్రామాల భక్తులు స్వామి వారిని దర్శించుకుని పూజలు చేశారు.


భీమేశ్వరాలయంలో యోగాంధ్ర ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఆర్డీవో అఖిల

భీమేశ్వరాలయంలో యోగాంధ్రకు సన్నద్ధం

ద్రాక్షారామ, జూన్ 8(ఆంధ్రజ్యోతి): ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో యోగాభ్యాసనకు సర్వం సన్నద్ధం చేసినట్లు ఆర్డీవో అఖిల తెలిపారు. ఆదివారం అధికారులతో కలసి యోగాంధ్ర ఏర్పాట్లు పరిశీలించారు. ఉదయం 7 గంటల నుంచి యోగా టీచర్లతో యోగాసనాలు నిర్వహించడం, యోగా ప్రాముఖ్యతపై ఉపన్యాసాలు ఇస్తారని తెలిపారు.

వాడపల్లి వెంకన్న ఆదాయం రూ.5.59 లక్షలు

ఆత్రేయపురం, జూన్ 8(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయానికి ఆదివారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో రద్దీ నెలకొంది. నోము ఆచరించిన భక్తులు అష్టోత్తర పూజలు, నిత్య కల్యాణాలు జరిపారు. స్వామివారిని దర్శించుకున్న అనంతరం భక్తజనం అన్నప్రసాదంలో పాల్గొన్నారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.5,59,390 వచ్చినట్టు ఉపకమిషనరు, ఈవో ఎన్.సూర్యచక్రధరరావు తెలిపారు.

తిరునక్షత్ర ఉత్సవాలు.. వాడపల్లి వెంకన్న క్షేత్రంలో మూడవ రోజు శనివారం నమ్మాళ్వార్ తిరునక్షత్ర ఉత్సవాలు, నాల్గో రోజు ఆదివారం ద్రవిడ వేద పారాయణం నిర్వహించారు. సాయంత్రం వేదమంత్రాల మధ్య స్వామివారి పల్లకీ ఉత్సవాన్ని ఘనంగా జరిపారు.


వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో అష్టోత్తర పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

పార్కింగ్ ప్రదేశంలో మెరక పనులు

ఆత్రేయపురం, (ఆంధ్రజ్యోతి): వాడపల్లి ఆలయానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం అభివృద్ధి పనులు వేగవంతం చేస్తున్నారు. ముఖ్యంగా ట్రాఫిక్ కష్టాలతో తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి. శ్రీనివాస ప్రాంగణంలోని ఏడు ఎకరాల స్థలంలో పార్కింగ్ సరిపోకపోవడంతో గోదావరి చెంతనే మరో ఆరు ఎకరాల్లో కారు పార్కింగ్ ఏర్పాటు చేశారు. అది కూడా సరిపోకపోవడంతో వాహనాలను ఎక్కడపడితే అక్కడ పార్కింగ్ చేస్తున్నారు. దర్శనం అనంతరం బయటకు వెళ్లే వాహనాలు ఇరుకు ప్రదేశం కావడంతో ట్రాఫిక్ స్తంభించిపోతోంది. కొత్త రోడ్డులోని శివాలయానికి చెందిన 8 ఎకరాల భూములను పార్కింగ్ కోసం మెరక చేస్తున్నారు. వీటి పనులు పూర్తయితే పార్కింగ్ కష్టాలు తొలగనున్నాయి. అభివృద్ధి పనులను ఉపకమిషనరు పర్యవేక్షించారు.


పంట పొలాల్లో వరిదుబ్బులకు నిప్పుపెడుతున్న రైతు

వరిదుబ్బులకు నిప్పు...పర్యావరణానికి ముప్పు

మండపేట, జూన్ 8(ఆంధ్రజ్యోతి): ఎండలు ప్రజను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. మరోపక్క వరి కోతలు పూర్తయి రైతులు వ్యవసాయ పనులకు బోర్లుపై శ్రీకారం చుడుతున్నారు. ఈ నేపథ్యంలో వరికోత తర్వాత పొలంలో మిగిలిపోయిన వరిదుబ్బులకు రైతులు నిప్పెడుతున్నారు. దానివల్ల పర్యావరణ సమతుల్యం దెబ్బతినటంతోపాటు, వాతావరణం కాలుష్యంగా మారుతోంది. మరోపక్క వరిచేలో వరిదుబ్బులు పంటదమ్ము సమయంలో దమ్ము చేస్తే పంటకు సేంద్రియ ఎరువుగా మారుతుంది. దాని వల్ల పొలానికి బలం కలుగుతుంది. రైతులు చేస్తున్న తప్పుడు చర్యలు వల్ల దుబ్బులకు నిప్పపెట్టడం వల్ల భూమిలో ఉండే పోషకాలు నాశనం కావటంతోపాటు, భూమిసారం కోల్పోతుందని పలువురు సూచిస్తున్నారు. రైతులు ఇక నుంచైనా ఇలాంటి చర్యలు మానుకోవాలని శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు.

పీఠంలో 11న జ్యేష్ఠ పౌర్ణమి పూజలు

రాయవరం, జూన్ 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెదురుపాక విజయదుర్గా పీఠంలో ఈనెల 11న జ్యేష్ఠ పౌర్ణమి పూజలు నిర్వహించనున్నట్లు పీఠం అడ్మినిస్ట్రేటర్ వీవీ బాపిరాజు తెలిపారు. ఆదివారం వెదురుపాకలో ఆయన మాట్లాడుతూ పౌర్ణమిని పురస్కరించుకుని విజయదుర్గ అమ్మవారికి వివిధ రకాల ద్రవ్యాలతో అభిషేకాలు, అర్చనలు నిర్వహిస్తామన్నారు. విజయ వేంకటేశ్వరస్వామికి సుప్రభాతసేవ, తులసిదళ అర్చనలు, భవాని శంకర అష్టలింగేశ్వరస్వామికి ఏకవార రుద్రాభిషేకం, నవగ్రహ, నక్షత్రహోమం పూర్ణాహుతి జరుగుతుందన్నారు. అనంతరం అన్నసమారాధన జరుగుతుందని అడ్మినిస్ట్రేటర్ తెలిపారు.

కంప్యూటర్ ఇంజనీర్ అవుతా

చైతన్య శివరామకృష్ణ



ద్రాక్షారామ, జూన్ 8(ఆంధ్రజ్యోతి): ఐఐటీలో సీటు సాధించి కంప్యూటర్ ఇంజనీర్ కావడమే తన లక్ష్యమని రామచంద్రపురం మండలం వేగాయమ్మపేటకు చెందిన కెఎస్.హరి చైతన్య శివరామకృష్ణ తెలిపాడు. ఏపీ ఈపిసెట్ ఇంజనీరింగ్ ఫార్మసీ విభాగంలో 270 ర్యాంకు సాధించి జిల్లాలో మూడవస్థానంలో నిలిచాడు. ఇంటర్ గుంటూరు భాష్యంలో చదివినట్లు శివరామకృష్ణ తెలిపారు.

డాక్టర్ కావాలన్నదే లక్ష్యం

శ్యాం కృష్ణారెడ్డి



రాయవరం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) ఆదివారం విడుదలైన ఎంపీ ఈఏపీ సెట్‌లో రాయవరం గ్రామం జమిందార్ కాలనీకి చెందిన ద్వారంపూడి శ్యాం కృష్ణారెడ్డి రాష్ట్రస్థాయిలో 57వ ర్యాంక్ సాధించాడు. టెన్, ఇంటర్ శశి వేలువెన్నులో చదివాడు. విద్యార్థి కృష్ణారెడ్డి తండ్రి ద్వారంపూడి ఆదిరెడ్డి ఫ్రౌల్టీ వ్యాపారం నిర్వహిస్తుండగా తల్లి భవాని గృహిణి. రాష్ట్రస్థాయిలో 54వ ర్యాంకు రావడం ఆనందంగా ఉందని కృష్ణారెడ్డి తెలిపారు. తన లక్ష్యం ఎస్ఐటీలో ర్యాంక్ సాధించడం ద్వారా డాక్టర్ కావాలన్నదే లక్ష్యన్నాడు.

కష్టపడి చదివాను

టి.శివమణిదీప్



రావులపాలెం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): నీట్‌కు ప్రిపేరు అయ్యాను. ఏపీఈఏపీసెట్ ఎటమ్ చేసి రాష్ట్రస్థాయిలో 44వ ర్యాంక్ రావడం ఆనందంగా ఉంది. నీట్ ప్రిపేరేషన్ కోసం కష్టపడి చదివాను. దానిలో భాగంగా ఈరోజు విడుదల అయిన ఏపీ ఈఏపీసెట్‌లో 44వ ర్యాంకు రావడంతో పాటు తనతోపాటు తన కుటుంబ సభ్యులు ఆనందిస్తున్నారు. తండ్రి రైల్వే ఉద్యోగి కాగా తల్లి గృహిణి అని తెలిపారు.

వేంకటేశ్వరస్వామి కల్యాణం

మలికిపురం, జూన్ 8(ఆంధ్రజ్యోతి): చింతలమోరిలో వేంచేసి ఉన్న పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామివారి కల్యాణ మహోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. దొడ్డా బ్రహ్మాజీ-విజయదుర్గాభవానీ దంపతులు కర్తలుగా కల్యాణం నిర్వహించారు. అనంతరం స్వామి వారిని గ్రామోత్సవం నిర్వహించారు. అన్న సమారాధన నిర్వహించారు.